


2019 ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధం హామీ ఇచ్చిన జగన్, అధికారంలోకి వచ్చాక నాసిరకం మద్యం విక్రయించారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పేదల ఆరోగ్యంతో చెలగాటమాడారనే ఆరోపణలపై జగన్ సమాధానం చెప్పాలి. ఇంత తీవ్రమైన ఆరోపణలపై మౌనం వహించడం సరికాదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


బుధవారం 23.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 153 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు

- వీకెండ్ ఎకానమీ పెంచేలా చర్యలు చేపట్టాలి
- అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పట్టణాభివృద్ధి శాఖను తీర్చిదిద్దాలి
- రూ.11,359 కోట్లతో పట్టణాభివృద్ధి పనులకు శ్రీకారం
- 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం





**కుప్పం, సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టణాలే అభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు.. అధికారులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేలా రూ.11,359 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో చేపట్టనున్న పనులకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఇంత భారీ ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టి రాష్ట్ర మున్సిపల్ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించామన్నారు. రెండేళ్లుగా సంక్లిష్ట పరిస్థితులను అధిగమిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నామని చెప్పారు. పట్టణ ప్రాంతాలు ఆర్థిక వ్యవస్థకు గ్రోత్ ఇంజన్లుగా మారేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పట్టణాల్లో లివబిలిటీ మెరుగుపడటంతో పాటు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా అభివృద్ధి చేయాలని చెప్పారు. పట్టణాల్లో వీకెండ్ ఎకానమీ విపరీతంగా పెరుగుతుందని సీఎం వివరించారు. ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో 61 శాతం డబ్బును వారాంతాల్లో ఖర్చు పెడుతున్నారని... అలాగే రవాణా నిమిత్తం 71 శాతం ఖర్చు పెడుతున్నారని వెల్లడించారు. దీనిపై అధికారులు.. ప్రజా ప్రతినిధులు మరింత అధ్యయనం చేయాలని సూచించారు. దీనికి అనుగుణంగా వారాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గృహవసతి, రవాణా వంటి అవసరాలపై పట్టణ ప్రజలు పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తున్న నేపథ్యంలో టిడ్కో ఇళ్లతో పాటు స్త్రీశక్తి వంటి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్-అర్బన్ డెవలప్మెంట్ విభాగం... అర్బన్ ప్రాస్పెరిటీ విభాగంగా పని చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

**టిడ్కో గృహాలు... ఇంటింటికి తాగు నీరు :** 2027 నాటికి రాష్ట్రంలోని టిడ్కో గృహాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. విశాఖ నగరంలో 28,500 కుటుంబాలకు ఇప్పటికే ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అభ్యంతరాలు లేని ప్రాంతాల్లో మరిన్ని పట్టాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పట్టణ ప్రజలకు 24 గంటలూ సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో జల్ జీవన్ మిషన్‌ను పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భవన నిర్మాణ అనుమతులను వేగంగా మంజూరు చేస్తున్నామని, పట్టణాభివృద్ధిలో పలు సంస్కరణలు చేపట్టామని చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల ద్వారా పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 143 లక్షల టన్నుల చెత్తను తొలగించామని, ప్రస్తుతం రెండు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు పనిచేస్తున్నాయని చెప్పారు. మరో నాలుగు ప్లాంట్ల నిర్మాణాన్ని త్వరలో మిగతా 2లో...

## పిఠాపురం ప్రగతికి రూ.1,500 కోట్లు

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



**పిఠాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** పిఠాపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు మరింత వేగం పెంచుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. తన రెండో రోజు పర్యటనలో భాగంగా మంగళవారం నియోజకవర్గంలో సుమారు రూ. 1,500 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రయోజనాలను అందజేసి, పలు అభివృద్ధి కార్యక్రమాలను స్వయంగా పరిశీలించారు. మరో నాలుగు నెలల్లో తన క్యాంపు కార్యాలయాన్ని పిఠాపురానికి మార్చనున్నట్లు వెల్లడించారు.

గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి ఆలయాన్ని ఉదయాన్నే పవన్‌కల్యాణ్ దర్శించుకున్నారు. ఏకాదశి వ్రతాచరణలో భాగంగా ప్రాతఃకాల సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదాశీర్వచనాలు అందించారు. మిగతా 2లో...

## మున్సిపల్ ఎన్నికలకు మరో అడుగు

- నేటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు
- తొలి విడతలో 12 కార్పొరేషన్లు, 29 మున్సిపాలిటీల్లో ప్రక్రియ
- సెప్టెంబరు 26న ముసాయిదా జాబితాల ప్రకటన
- అక్టోబరు 1న తుది జాబితా వెల్లడి
- రిజర్వేషన్ల ఖరారుకు ఓటర్ల గుర్తింపు కీలక దశ

2 లో

## డ్రగ్స్‌పై సమరశంఖం

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు



**అమరావతి, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మాదకద్రవ్య రహిత భారత నిర్మాణానికి యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా మిషన్ మోడ్‌లో పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న మూడో జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ అధిపతుల సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఏకీకృత సంకల్పం, ఉమ్మడి బాధ్యత అనే ప్రధాన ఉద్దేశంతో మిగతా 2లో...

## అమరావతి క్వాంటం వ్యాలీలో సమగ్ర జన్యు విశ్లేషణ కేంద్రం





- మంత్రి సత్యకుమార్ వెల్లడి
- గుంటూరు జీజీహెచ్‌లో జీనోమ్ సీక్వెన్సింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి
- క్యాన్సర్ కేసుల గుర్తింపు, చికిత్సకు విస్తృత ఏర్పాట్లు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిలో ఏర్పాటు కానున్న క్వాంటం వ్యాలీలో అరుదైన వ్యాధులకు సంబంధించిన జన్యుపరమైన కారణాలను గుర్తించేందుకు అతిపెద్ద స్థాయిలో సమగ్ర జన్యు విశ్లేషణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లోని నాట్కో క్యాన్సర్ కేంద్రంలో ఏర్పాటు చేసిన జీనోమ్ సీక్వెన్సింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం ఈ కేంద్రాన్ని పైలట్ ప్రాతిపదికన నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో క్వాంటం వ్యాలీలో ఏర్పాటు



## డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం.. జగన్ రెడ్డి సిద్ధమా?

- ఉపాధ్యాయులపై దాడులను సహించేది లేదని వ్యాఖ్య
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి మించి గెలుపే లక్ష్యం
- పాదయాత్రలో వెంట నడిచిన కార్యకర్తలను కాపాడుకుంటానని వెల్లడి
- రాప్తాడులో ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ



**రాప్తాడు (జర్నలిస్ట్ ఫైల్) :** మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం. జగన్ రెడ్డి సిద్ధమా అని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మరోసారి సవాల్ చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడు కూడలిలో ఏర్పాటుచేసిన స్వర్గీయ అన్న నందమూరి తారకరామారావు, మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత స్వర్గీయ పరిటాల రవీంద్ర విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... ఈ రోజు మనం వేదికపై ఉన్నామంటే కారణం వేదిక కింద ఉన్న

## హంద్రీనీవా జలాలకు సీఎం జల హారతి



- కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ప్రత్యేక పూజలు
- బీరగానిపల్లె రిజర్వాయర్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు

3 లో

## పారిశ్రామికవేత్తలుగా పౌల్ట్రీ రైతులు




- వాతావరణ అనుకూల పౌల్ట్రీ షెడ్ల ఏర్పాటుకు కార్యాచరణ
- ఐబీ గ్రూప్‌తో కలిసి కుప్పంలో పైలట్ ప్రాజెక్టు
- రైతులు ఎంఎస్ఎంఈలుగా ఎదిగేలా రియల్ టైమ్‌లో అనుమతులు
- కుప్పం పౌల్ట్రీ రైతులతో ముఖాముఖీలో ముఖ్యమంత్రి చంద్రబాబు

3 లో

## మళ్లీ 'నంది' మోగనుంది



- నంది ఫిల్మ్స్, టీవీ అవార్డుల పునరుద్ధరణ
- 2012-16తో పాటు 2017-25 అవార్డులు
- అక్టోబరులో కమిటీలు.. నవంబరులో ఎంపిక
- డిసెంబరులో అవార్డుల ప్రదానం
- ఫిల్మ్ 46.. టీవీ 48 పురస్కారాలు

3 లో

## పింఛన్లకు రూ.33,485 కోట్లు



- అక్టోబర్ ఒకటి నుంచే కేంద్ర వాటా బ్యాంకు ఖాతాల్లో జమ
- రాష్ట్ర వాటా యథావిధిగా ఇంటి వద్దే పంపిణీ

2 లో

**అమరావతి, సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని 62 లక్షల మంది ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులకు ప్రతి నెలా ఇంటి వద్దే పింఛను అందిస్తూ ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత

# పట్టణాలే గ్రోత్ ఇంజిన్లు




(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేస్తామని వెల్లడించారు. ఘన వ్యర్థాలను రీసైక్లింగ్ విధానంలో శాస్త్రీయంగా నిర్వహిస్తూ మున్సిపాలిటీల్లో మురుగునీరు, చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

**పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం లేకుండా హైబ్రీడ్ యాన్యుటీ పద్ధతుల్లో అభివృద్ధి పనులు :** ప్రస్తుతం ప్రారంభించిన పనులతో కలిపి పట్టణ ప్రాంతాల్లో రూ. 50 వేల కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఇవన్నీ పూర్తయితే రాష్ట్ర పట్టణ ప్రాంతాల దశ, దిశ మారుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే రూ. 22,330 కోట్ల విలువైన పనులు కొనసాగుతున్నాయని, మరో ఆరు నెలల్లో రూ. 17 వేల కోట్ల పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో తొలిసారిగా పట్టణాభివృద్ధి పనులు చేపడుతున్నామని సీఎం తెలిపారు. పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా ఈ విధానంలో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. 123 మున్సిపాలిటీల పరిధిలో రూ. 7,469 కోట్లతో, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ. 3,890 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ. 4,656 కోట్లతో రహదారులు, రూ. 88 కోట్లతో సెంట్రల్ మీడియన్లు, రూ. 247 కోట్లతో వీధి దీపాలు, రూ. 509 కోట్లతో పార్కుల అభివృద్ధి చేపట్టనున్నారు. మొత్తం సుమారు 2,165 కిలోమీటర్ల రహదారులు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజీ పనులు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పాల్గొనగా... కుప్పంలో జరిగిన కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కమిషనర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# డ్రగ్స్‌పై సమరశంఖం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు వర్చువల్‌గా పాల్గొన్నారు. దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం మిషన్ మోడ్‌లో పనిచేస్తోందని, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా సమన్వయంతో కృషి చేయాలని అమిత్ షా సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి రూపొందించిన విజన్ డాక్యుమెంట్ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్‌ల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం సదస్సు ప్రధాన లక్ష్యాల్లో ఒకటని అమిత్ షా తెలిపారు. రాష్ట్రస్థాయి అనుభవాలు, కేంద్ర దర్యాప్తు సంస్థల సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం ద్వారా భవిష్యత్ కార్యాచరణకు స్పష్టమైన దిశను రూపొందించుకోవచ్చన్నారు. యువతపై మాదకద్రవ్యాల ప్రభావాన్ని నిరోధించడం, అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను అడ్డుకోవడం, దర్యాప్తు సామర్థ్యాన్ని పెంచడం, కేంద్ర-రాష్ట్ర సంస్థల మధ్య సమన్వయాన్ని వేగవంతం చేయడం వంటి అంశాలపై సదస్సులో చర్చిస్తున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల స్మగ్లర్లు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలు, పోలీసు బలగాలకు సూచించారు. మాదకద్రవ్యాల కేసుల్లో నిందితుల ఆస్తులను సంబంధిత చట్టాల కింద జప్తు చేయడంతో పాటు ప్రత్యేక కోర్టుల ద్వారా కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణించి, మానవీయ దృక్పథంతో పునరావాస చర్యలు చేపట్టాలని సూచించారు. డార్క్‌నెట్, క్రిప్టో దర్యాప్తులు, సింథటిక్ డ్రగ్స్ నియంత్రణ వంటి సాంకేతిక అంశాలపైనా సదస్సులో చర్చించారు. అమరావతి సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ వర్చువల్‌గా సదస్సులో పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులపై దాడి హేయమైన చర్య

- **ఉద్యోగులు, ఉపాధ్యాయులపై దాడులను సహించేది లేదు**
- **ప్రజాస్వామ్య హక్కులను కాపాడేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**
- **ఏపీ జెఎసి చైర్మన్,ఏపీ ఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్**



విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్): ప్రజాస్వామ్య పద్ధతిలో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వినతిపత్రం సమర్పించేందుకు వచ్చిన ఉపాధ్యాయులపై విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద సోమవారం జరిగిన దాడిని ఏపీ ఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి వి రమణ ఖండించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సమస్యలు, మనోభావాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే హక్కును హరించేలా దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.

తమపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ, సంబంధిత అధికారులను కలిసి వాస్తవాలను వివరించేందుకు వెళ్లిన ఉపాధ్యాయులపై దాడి చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదని విద్యాసాగర్ స్పష్టం చేశారు.

సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాల్సిన సమయంలో దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ హక్కులు, సమస్యలపై శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో సహజమైన ప్రక్రియ అని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం, పోలీసు శాఖను విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షిస్తే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలకు దారితీసే అవకాశం ఉందని, అందువల్ల ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత, వారి ప్రజాస్వామ్య హక్కులకు పూర్తి భరోసా రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని ఏపీ ఎన్‌జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్ ప్రభుత్వాన్ని కోరారు.

# అమరావతి క్వాంటం వ్యాలీలో సమగ్ర జన్యు విశ్లేషణ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)



చేసే కేంద్రం ద్వారా అధునాతన జన్యు పరీక్షలు, పరిశోధనలను మరింత విస్తరిస్తామని మంత్రి సత్యకుమార్ తన ప్రసంగంలో చెప్పారు. క్యాన్సర్‌తో పాటు అరుదైన వ్యాధులకు సంబంధించిన జన్యు సమాచారాన్ని సమగ్రంగా సేకరించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

**ముందస్తు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి :** క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. 4.27 కోట్ల మంది లక్ష్య జనాభాలో ఇప్పటివరకు సుమారు 2.65 కోట్ల మందికి పరీక్షలు నిర్వహించామని, దాదాపు 7,500 కొత్త క్యాన్సర్ కేసులను గుర్తించామని వెల్లడించారు. అనుమానితులను తదుపరి నిర్ధారణ పరీక్షలకు పంపించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో చికిత్స అందేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో గత ప్రతి ఏడాది 70000కు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, 40 వేల మంది వరకు మరణిస్తున్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో నమోదయ్యే మొత్తం మరణాల్లో క్యాన్సర్ వాటా 9.6 శాతంగా ఉందన్నారు. 2020 నుంచి 2025 మధ్య కొత్త క్యాన్సర్ కేసులు 39.5 శాతం పెరిగాయని వివరించారు. ప్రజలు జీవనశైలిలో మార్పులు చేసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

**రూ.311 కోట్లతో నాలుగు కేంద్రాలు :** గుంటూరు, విశాఖపట్నం, కర్నూలు, కడపలో నాలుగు సమగ్ర క్యాన్సర్ కేంద్రాలను తొలి దశలో రూ. 311 కోట్లతో అభివృద్ధి చేశామని మంత్రి తెలిపారు. వీటికి 596 వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టులు మంజూరు చేసి భర్తీ చేశామని చెప్పారు. గుంటూరు, విశాఖపట్నం, కర్నూలులో అధునాతన రేడియేషన్ పరికరాలు, బ్రాకీథెరపీ, సీటీ సిమ్యులేటర్ వంటి సదుపాయాలు కల్పించామని వివరించారు.

కాకినాడ, అనంతపురంలో రెండో దశలో క్యాన్సర్ కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. మూడో దశలో మరో 11 వైద్య కళాశాల ఆసుపత్రులను క్యాన్సర్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**గుంటూరు కేంద్రంలో అధునాతన సేవలు :** గుంటూరు నాట్కో క్యాన్సర్ కేంద్రాన్ని రూ. 41 కోట్లతో అభివృద్ధి చేశామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. లీనియర్ యాక్సిలరేటర్, బ్రాకీథెరపీ, సీటీ సిమ్యులేటర్, శస్త్రచికిత్స పరికరాలను అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ప్రభుత్వ వైద్య సంస్థల్లో తొలిసారిగా రూ. 18 కోట్లతో పెట్ స్కాన్ ఏర్పాటు చేశామని తెలిపారు.

**జన్యు పరీక్షలతో చికిత్సలో మార్పు :** గుంటూరు కేంద్రంలో ఏర్పాటు చేసిన జన్యు పరీక్షల విభాగం ద్వారా రొమ్ము, ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు జన్యు, జీవసూచిక పరీక్షలను ఉచితంగా అందిస్తామని మంత్రి తెలిపారు. ప్రైవేటు ప్రయోగశాలల్లో రూ. 25 వేల వరకు ఖర్చయ్యే పరీక్షలను ఇక్కడ ఉచితంగా చేయనున్నామని చెప్పారు. జీనోమ్ సీక్వెన్సింగ్ ద్వారా క్యాన్సర్ కణాల్లోని జన్యు మార్పులను గుర్తించి, రోగికి సరిపోయే మందు, చికిత్స విధానాన్ని ఎంచుకునేందుకు వైద్యులకు మరింత సమాచారం లభిస్తుందని వివరించారు. భవిష్యత్తులో కుటుంబాల్లో జన్యుపరమైన వ్యాధుల ముప్పును కూడా ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుందన్నారు.

**ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా రూ.25 లక్షల వరకు :** ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఒక్కో క్యాన్సర్ రోగికి రూ. 25 లక్షల వరకు వైద్యసేవలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ వైద్య సేవలకు గత రెండేళ్లలోనే సుమారు రూ. 1,500 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. 2019 నుంచి 2024 వరకు సుమారు రూ. 2,200 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. క్యాన్సర్ చికిత్స కోసం పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి అన్నారు. ముందస్తు పరీక్ష నుంచి నిర్ధారణ, శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ వరకు అవసరమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. క్యాన్సర్ రోగులు ప్రతి చికిత్స కోసం దూర ప్రాంతాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా 23 జిల్లాల్లో పగటి కీమోథెరపీ కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి సత్యకుమార్ తెలిపారు. దీనివల్ల రోగులకు ప్రయాణ భారం తగ్గడంతో పాటు తమ ప్రాంతానికి దగ్గర్లోనే చికిత్స పొందే అవకాశం ఏర్పడిందన్నారు.

క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. వైద్య, నర్సింగ్ విద్యార్థులు కొత్త సాంకేతికత, పరిశోధనలపై దృష్టి పెట్టాలని, భవిష్యత్తులో అధునాతన వైద్య పరికరాలను దేశంలోనే అభివృద్ధి చేసే దిశగా కృషి చేయాలని సూచించారు.

**ప్రొఫెసర్ రమేష్‌బాబుకు సన్మానం :** క్యాన్సర్ వైద్య సేవల విస్తరణకు కృషి చేస్తున్న వైద్య విద్యాశాఖ ప్రధాన కార్యాలయంలోని క్యాన్సర్ వైద్య సేవల పర్యవేక్షకుడు ప్రొఫెసర్ రమేష్‌బాబును మంత్రి సత్యకుమార్ యాదవ్, అధికారులు సన్మానించారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం చేసినట్లు వైద్య విద్యాశాఖ సంచాలకులు విష్ణువర్ధన్ తెలిపారు. క్యాన్సర్ వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామని వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండ్యన్ తన ప్రసంగం ద్వారా చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు, జన్యు విశ్లేషణ కేంద్రం భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిఠాపురం ప్రగతికి రూ.1,500 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్నికల అనంతరం ఆలయ అభివృద్ధికి రెండు విడతల్లో దాదాపు రూ. 90 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నిధులతో కాలక్షేప మండపం, రథశాల, అన్నదాన హాలు, యాగశాల తదితర పనులు చేపట్టారు.

యు.కొత్తపల్లి మండలంలో రూ. 9.59 కోట్లతో ఆధునీకరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథకాన్ని పవన్‌కల్యాణ్ ప్రారంభించారు. పథకం ద్వారా పిఠాపురం నియోజకవర్గంలోని సుమారు 52 ఆవాసాల్లో 97 వేల మందికి తాగునీరు అందేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. మంచినీటి సరఫరా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన పవన్‌కల్యాణ్ పథకం వివరాలను తెలుసుకున్నారు. కొండేవారంలో ఇంటింటికీ ఏర్పాటు చేసిన కుళాయి కనెక్షన్‌ను కూడా పరిశీలించారు.

ఆర్ఆర్‌బీహెచ్ఆర్ మైదానంలో నిర్వహించిన 'పిఠాపురం నిండుగా.. అభివృద్ధి పండుగ' బహిరంగ సభలో పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఉప్పాడ తీరంలో సముద్రపు కోత సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రూ. 323 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. అమృత్ భారత్ పథకం కింద రూ. 35 కోట్లతో పిఠాపురం రైల్వే స్టేషన్‌ను



అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. పిఠాపురంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించామని, రోజుకు 72 లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం చేపట్టామని వివరించారు.

రూ. 225 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ నిర్మిస్తున్నామని, రూ. 34 కోట్లతో ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ పనులు ప్రారంభించామని పవన్‌కల్యాణ్ తెలిపారు. రూ. 2 కోట్లతో కుంతీమాధవస్వామి ఆలయ కోనేరు పునరుద్ధరణ చేపట్టినట్లు పేర్కొన్నారు. మొబైల్ క్యాన్సర్ పరీక్ష వాహనాలను ఏర్పాటు చేయడంతో పాటు రోజుకు 40 టన్నుల తడి చెత్తను శుద్ధి చేసే ప్లాంట్లను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు.

కార్యక్రమంలో 30 మంది మత్స్యకారులకు రక్షణ పరికరాలు, లైఫ్ జాకెట్లు అందజేశారు. గృహాల క్రమబద్ధీకరణ పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, విద్యార్థులకు బ్యాగులు అందించారు. స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు పంపిణీ చేశారు. రైతు సంఘాల ప్రతినిధులు పవన్‌కల్యాణ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాగలిని బహూకరించారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకుల్లో ఉత్సాహం తగ్గకూడదని జనసేన నాయకులకు పవన్‌కల్యాణ్ సూచించారు. కూటమి మరింత బలంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నాయకుల ఆకాంక్షల కంటే ప్రజల అవసరాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు.

కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు పంతం నానాజీ, బత్తుల బలరామకృష్ణ, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారులు గాయత్రి దేవి, హరి రామ్ నాయక్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు మరో అడుగు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుకు అవసరమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు ప్రక్రియను మంగళవారం నుంచి చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని తొలి విడతగా ఎంపిక చేసిన పట్టణ స్థానిక సంస్థల్లో ఈ ప్రక్రియను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయనున్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఇప్పటికే మేయర్లు, చైర్‌పర్సన్లు, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నిబంధనలు జారీ చేసిన విషయం తెలిసిందే.

తొలి విడతలో 12 నగరపాలక సంస్థలు, 29 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఓటర్ల సామాజిక వర్గాల వారీగా గుర్తింపు చేపట్టనున్నారు. సెప్టెంబరు 23 నుంచి 25 వరకు ఎస్సీ, ఎస్టీ, మహిళా ఓటర్లను వార్డుల వారీగా గుర్తిస్తారు. అనంతరం సెప్టెంబరు 26న ముసాయిదా జాబితాలను ఆయా వార్డుల్లో ప్రకటిస్తారు. సెప్టెంబరు 27, 28 తేదీల్లో ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు, సూచనలు స్వీకరిస్తారు. 29, 30 తేదీల్లో వాటిని పరిశీలించి అవసరమైన క్షేత్రస్థాయి దిద్దుబాట్లు చేపట్టనున్నారు. అక్టోబరు 1న తుది జాబితాను ప్రకటించేలా కార్యాచరణ రూపొందించారు.

బీసీ ఓటర్ల గుర్తింపు ప్రక్రియను కూడా ఇదే తరహాలో నిర్వహించనున్నారు. విశాఖ, రాజమహేంద్రవరం, గుంటూరు, అనంతపురం ప్రాంతాల పరిధిలో తొలి విడతగా ఎంపిక చేసిన పట్టణ స్థానిక సంస్థల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. రిజర్వేషన్ల ఖరారుకు ఓటర్ల గుర్తింపు కీలకమైన దశ కావడంతో మున్సిపల్ అధికారులు, సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు. రిజర్వేషన్ ప్రక్రియ అనంతరం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల తదుపరి కార్యాచరణకు మార్గం సుగమం కానుంది.

# డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం..జగన్ రెడ్డి సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ కార్యకర్తల త్యాగం వల్లే. ఈ రోజు నేను స్వర్గీయ ఎన్టీఆర్ మనవడిగా, సీఎం చంద్రబాబు గారి తనయుడిగా, బాలయ్య మావయ్య అల్లుడిగా రాలేదు. ఎత్తిన పసుపు జెండా దించకుండా, మడమ తిప్పకుండా, టీడీపీకి కాపలాకాసిన కార్యకర్తగా ఇక్కడకు వచ్చాను. అన్న ఎన్టీఆర్ గారు ఏ ముహూర్తంలో పార్టీని స్థాపించారో తెలియదు. నాకు అక్కతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లు లేరు, కానీ కోటి మంది కుటుంబ సభ్యులను ఇచ్చారు. మీ పౌరుషమే వేరు. అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చారు. రాజకీయాల్లో, సినిమాల్లో స్వర్గీయ ఎన్టీఆర్ గారి స్టైలే వేరు. ఆనాడు యువగళంలో దారిపొడవునా ప్రజలు నాకు నీరాజనాలు పలికారు. పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ఆనాటి సంబరం మళ్లీ ఈనాడు చూస్తున్నా.

**నమ్మిన సిద్ధాంతం కోసం తుదివరకు పోరాడిన వ్యక్తి పరిటాల రవి :** నేను కూడా అన్న ఎన్టీఆర్ సీఎం అయిన తర్వాతనే పుట్టా. రూ. 2కే కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్, పట్వారీ వ్యవస్థ రద్దు వంటి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎన్టీఆర్ గారు చేపట్టారు. ఈ రోజు మనందరం అన్న ఎన్టీఆర్ గారి వారసులం. ఈ రోజు మనం ఎక్కడికి వెళ్లినా గర్వంగా చెప్పుకోవచ్చు.. నా పార్టీ తెలుగుదేశం, నా పార్టీ, నా అజెండా అన్న ఎన్టీఆర్ అని. చంద్రబాబు గారు మొదటిసారి ముఖ్యమంత్రి అయినా అభివృద్ధి, సంక్షేమం చేశారు. పరిటాల రవి గారు కూడా ఎమ్మెల్యేగా, మంత్రిగా అనేక పనులు చేశారు. మన పార్టీ అధికారంలోకి రాకముందు రాయలసీమలో మహిళలు బయట తిరగాలంటే బయపడే పరిస్థితి. దానికి ఫుల్ స్టాప్ పెట్టిన నాయకుడు మన పరిటాల రవీంద్ర గారు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేశారు. ఆనాడు వందలాది మంది మన కార్యకర్తలను హత్య చేశారు. అయినా పరిటాల రవి గారు ఏనాడు భయపడలేదు. పార్టీ సమావేశానికి వెళ్తే చంపేశారు. అయినా ఆ కుటుంబం వెనక్కి తగ్గలేదు. పరిటాల సునీతమ్మ ముందుకు వచ్చారు. అసెంబ్లీలో బయపెట్టినా ఆమె భయపడలేదు. పార్టీని ముందుకు తీసుకెళ్లారు. ఇప్పుడు పరిటాల శ్రీరామ్ ని కూడా పార్టీకి అంకితం చేశారు.

**ఫైటర్ జెట్ తయారీ ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను అనంత గడ్డకు తీసుకువచ్చాం :** రాప్తాడు ప్రజలు చాలా మంచివారు. ప్రజలను కలిసినప్పుడు ఇప్పుడు ఎవరూ నా చేతులను గీరలేదు. ధర్మవరంలో అయితే మొత్తం గీరేశారు. కార్యకర్తలు, నాయకులు 2019-24 మధ్య పడిన కష్టాలను గుర్తుచేసుకోవాలి. జీవో 1 ద్వారా యువగళం పాదయాత్రను అడ్డుకోవాలని చూశారు. స్టూల్, మైక్ లాక్కున్నారు. అయినా ఎక్కడా తగ్గలేదు. వేదిక ముందున్న నాయకులు, కార్యకర్తల ప్రోత్సాహంతో ఆనాడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో యువగళం పాదయాత్ర చేశా. ఇక్కడి ప్రజల కష్టాలను చూశా. అందుకే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫైటర్ జెట్ లు తయారుచేసే ఏఎంసీఏ ప్రాజెక్ట్ ను మన అనంతపురం గడ్డకు తీసుకువచ్చా. సాగు, తాగునీరు, పరిశ్రమలను తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రత్యేకంగా నాపై బాధ్యత ఉంది. ఎందుకంటే అన్న ఎన్టీఆర్ ను, హరి మావయ్య, బాలయ్య మామను గెలిపించి శాసనసభకు పంపించిన అద్భుతమైన నేల ఇది. తాగునీరు, సాగునీరు అందిస్తాం.



**కలిసికట్టుగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం :** త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. ఎన్నికలు.. ఎన్నికలే.. తగ్గేదేలే. కష్టపడాలి, పనిచేయాలి. మనది పెద్ద కుటుంబం. కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారు. మన కుటుంబం పెద్దదైంది. ఇప్పుడు పవనన్న కూడా మన కుటుంబ సభ్యుడు అయ్యారు. బీజేపీ కూడా మన కుటుంబంలో చేరింది. మూడు పార్టీలు ఏపీని ముందుకు తీసుకెళుతున్నాయి. సమస్యలు ఏవైనా ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని పరిష్కరించుకుందాం. నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి అందరూ కట్టుబడి ఉండాలి. కష్టపడి పనిచేసే వారిని గుర్తించి గౌరవిస్తాం. మన రాష్ట్రాన్ని మనందరం కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉంది. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది.

**మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే! :** గొడ్డలితో బతికినవాళ్లు గొడ్డలితోనే పోతారు. పాఠాలు చెప్పే టీచర్లపై ఎలా దాడి చేశారో చూశాం. అ-య్యా జగన్.. ఎందుకు మా ఉపాధ్యాయులంటే నీకు అంత కక్ష. డీఎస్సీపై చర్చకు సిద్ధమని నేను ఎన్నోసార్లు చెప్పా. నేను సిద్ధం.. నువ్వు సిద్ధమా? జగన్ రెడ్డి మాదిరిగా ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లాలంటే మాకు కోర్టు అనుమతి అవసరం లేదు. నీతి, నిజాయతీతో బతికినవాళ్లం. జగన్ రెడ్డి పెట్టిన కేసులు దొంగకేసులని ఏకంగా సుప్రీంకోర్టే తేల్చిసిన పరిస్థితి. జగన్ రెడ్డి జాగ్రత్తగా ఉండు.. మా ఉపాధ్యాయుల జోలికొస్తే.. దబిడి దిబిడే. ఎవరినీ వదిలిపెట్టేది లేదు. ఉపాధ్యాయులపై దాడికి రౌడీమూకలను పంపారు. మొన్నటివరకు మన పార్టీలో వంగి, వంగి ఉన్నారు. ఇప్పుడు అక్కడకు వెళి కాలరెగరేస్తున్నారు. వదిలిపెట్టను భయ్యా! అన్నీ చూస్తున్నా. ఉపాధ్యాయులపై కోడిగుడ్లు వేస్తారా? అసభ్యంగా మాట్లాడతారా? అసలు మీరెక్కడ చదివారు? ఎవరు చదివించారు? ఇదేనా ఇంట్లో మీ తల్లిదండ్రులు నేర్పించిన సంస్కృతి? ఇదేనా ఉపాధ్యాయులకు మీరిచ్చే గౌరవం. నేను వదిలిపెట్టను. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని వదిలిపెట్టేది లేదు. రెడ్ బుక్ కు కట్టుబడి ఉన్నా. ప్రజలకు కూడా చెప్పా. వారి ఆశీస్సులతో 94శాతం స్థానాలు కైవసం చేసుకున్నాం. ఇక్కడున్న కార్యకర్తలకు ఒకటే చెబుతున్నా.. కష్టపడదాం, ప్రజలకు సేవచేద్దాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో 94శాతం కంటే ఎక్కువ గెలవాలి. ఈగో వద్దు, ప్రజల్లో ఉందాం.

**పాదయాత్రలో నాతో నడిచిన వారిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటా :** రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, పరిటాల రవి గారి విగ్రహాలను ఆవిష్కరించే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నా. ఈ రోజు నా తమ్ముడు పరిటాల శ్రీరామ్ పుట్టిన రోజు. నా తమ్ముడు పుట్టినరోజు నాడు విగ్రహాలను ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా. శ్రీరామ్ కు ఉదయం లేచిన వెంటనే పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ మొదటి మెసేజ్ పెట్టింది నేనే. ఒక్కసారి నమ్మితే నేను వదిలిపెట్టను. ఆనాడు పాదయాత్రలో నాతో నడిచిన వారు, ఆనాడు ఎన్ని ఇబ్బందులు పెట్టినా మీరు నన్ను నడిపించారు. నా జీవితాంతం మిమ్మల్ని నా గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటానని చెప్పారు. తనకు ఘనస్వాగతం పలికిన రాప్తాడు ప్రజలకు ఈ సందర్భంగా మంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ బీకే పార్థసారథి, మంత్రి ఎస్. సవిత, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే, హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు ఎం.ఎస్ రాజు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకట ప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, హిందూపురం పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి హనుమప్ప తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ 'నంది' మోగనుంది



**విజయవాడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు సినీ, టెలివిజన్ రంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గౌరవించేందుకు నంది అవార్డులను పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఏపీ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పి. భరత్ భూషణ్, ఎండీ కె. విశ్వనాథన్ తెలిపారు. 2012 నుంచి 2016 వరకు గతంలో ప్రకటించిన నంది ఫిల్మ్, టీవీ అవార్డులను అందించడంతో పాటు 2017 నుంచి 2024 వరకు ప్రతి సంవత్సరం నాలుగు అవార్డుల చొప్పున, 2025 సంవత్సరానికి కూడా ఫిల్మ్, టీవీ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. నంది ఫిల్మ్, జాతీయ చలనచిత్ర అవార్డులను అమరావతి లేదా విజయవాడలో, నంది టీవీ అవార్డులను తిరుపతిలో ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

అక్టోబరులో అవార్డుల ఎంపిక కమిటీలను ఏర్పాటు చేసి, నవంబరులో ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి, డిసెంబరు 2026లో అవార్డుల ప్రదానోత్సవాలు నిర్వహించనున్నట్లు భరత్ భూషణ్ తెలిపారు. నంది ఫిల్మ్ అవార్డుల్లో చలనచిత్రాలు, జాతీయ సమైక్యత, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, విద్యా చిత్రాలు, తెలుగు సినిమాపై రచనలు తదితర విభాగాల్లో మొత్తం 46 అవార్డులు అందించనున్నట్లు చెప్పారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు, నటి, సహాయ నటుడు, సహాయ నటి తదితర విభాగాల్లో అవార్డులతో పాటు బంగారు, వెండి, కాంస్య, తామ్ర నందులు, ప్రశంసాపత్రాలు, నగదు పారితోషికాలు అందించనున్నట్లు తెలిపారు. ఎన్.టి.ఆర్. నేషనల్ ఫిల్మ్ అవార్డుకు రూ. 5 లక్షలు, బి.ఎన్. రెడ్డి, నాగిరెడ్డి–చక్రపాణి, రఘుపతి వెంకయ్య అవార్డులకు రూ. 2 లక్షల చొప్పున నగదు పారితోషికం అందించనున్నట్లు పేర్కొన్నారు.

టెలీ చిత్రాలు, టీవీ ఫీచర్లు, మెగా సీరియళ్లు, డైలీ సీరియళ్లు, బాలల చిత్రాలు, డాక్యుమెంటరీలు, సామాజిక, విద్యా కార్యక్రమాలు తదితర విభాగాల్లో నంది టీవీ అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. మొత్తం 48 టీవీ అవార్డులతో పాటు నటుడు, నటి, సహాయ నటుడు, హాస్య నటుడు, హాస్య నటి, ప్రతినాయకుడు, బాలల నటులు, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత తదితర విభాగాల్లో పురస్కారాలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అవార్డు గ్రహీతలకు నందులతో పాటు ప్రశంసాపత్రాలు, నగదు పారితోషికాలు అందించనున్నట్లు చైర్మన్, ఎండీ తెలిపారు.

# హంద్రీనీవా జలాలకు సీఎం జల హారతి



**కుప్పం, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** కుప్పం నియోజకకర్గంలోని చివరి ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు తరలి వచ్చిన హంద్రీనీవా జలాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జలహారతి ఇచ్చారు. కుప్పంలోని శాంతిపురం మండలంలోని హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టులోని కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్ద ఈ జలాలకు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు చేసి పసుపు కుంకుమలు సమర్పించారు. అనంతరం స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలతో కలిసి హంద్రీనీవా జలాలకు పుష్పాలు సమర్పించి హారతి ఇచ్చారు. కుప్పం బ్రాంచ్ కు ఇరువైపులా నిలబడి రైతులు మహిళలు హర్షాతి రేకాలు వ్యక్తం చేశారు. నీవా జలాలకు నీరాజనాలు పలికారు. హంద్రీనీవా జలం కుప్పానికి వరం అంటూ నినాదాలు చేశారు. కుప్పం అభివృద్ధికి నీటి భద్రత కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అందుకే శ్రీశైలం మల్లన్న పాదాల చెంత నుంచి హంద్రీనీవా పథకం ద్వారా కుప్పానికి తీసుకువచ్చామని అన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 133 చిన్న నీటి చెరువులు నింపి తాగునీటి కొరత లేకుండా చేశామని స్పష్టం చేశారు. గత ఏడాది 2.4 టీఎంసీల నీటిని విడుదల చేశామని దీని ప్రభావంతో భూగర్భ జలాలు 3 మీటర్ల మేర పెరిగాయని.. ఎండిపోయిన బోర్లు జీవం పోసుకున్నాయని అన్నారు.

**నూతన రిజర్వాయర్ల నిర్మాణం :** అంతకుముందు బీరగానిపల్లె వద్ద రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టాల్సిన పనులకు సంబంధించి సీఎం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ రిజర్వాయర్ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు సీఎం స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాలో యామిగానిపల్లి, మదనపల్లి ప్రాంతాల్లో రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. కుప్పంలో 550కి పైగా మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు లిఫ్ట్ ఇరిగేషన్ , పైపులైన్లు, గ్రావిటీ కాలువలతో అనుసంధానం చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

# బంగాళాఖాతంలో వాయుగుండం

- **హోంమంత్రి అనిత సమీక్ష**
- **ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **ప్రభావిత జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధం**



**అమరావతి, సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వాయుగుండం కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. రేపు, ఎల్లుండి కోస్తాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభావిత జిల్లాల యంత్రాంగం రానున్న మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదని, బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచుకోవాలని కోరారు.

వాయుగుండం ప్రస్తుతం గోపాల్‌పూర్, కళింగపట్నం నుంచి సుమారు నూట ఎనభై కిలోమీటర్లు, విశాఖపట్నం నుంచి సుమారు రెండు వందల డెబ్బై కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రేపు రాత్రి లేదా ఎల్లుండి తెల్లవారుజామున విశాఖపట్నం–గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం ఉందని వెల్లడించారు. ముందస్తు సహాయక చర్యల్లో భాగంగా ప్రభావిత జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి ఆదేశించారు. వాగులు, కాజ్‌వేల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అవసరమైతే రాకపోకలను నియంత్రించాలని, ఈదురుగాలుల నేపథ్యంలో చెట్లు, హోర్డింగ్‌లు, పాత భవనాల వద్ద ప్రజలు ఉండకూడదని సూచించారు. వాయుగుండంపై ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని, విపత్తుల నిర్వహణ సంస్థ, ఆర్‌టీజీఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 టోల్‌ఫ్రీ నంబర్లను సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# గుండ్రెడ్డి మరణ వార్త దిగ్భ్రాంతికి గురిచేసింది

- **మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్**



బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ): పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆలోచన విధానంతో కర్లపాలెం మండలం యాజలి గ్రామ అభివృద్ధికి కోటి రూపాయలు నిధులు అందజేసిన సేవా తత్పరుడు గుండ్రెడ్డి సత్యనారాయణ మరణ వార్త తనను ఎంతగానో దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ఎమ్మెల్సీ,భారతీయ జనతా పార్టీ జాతీయ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమని తనకు మంచి స్నేహితుడిగా ఉన్న వ్యక్తిని కోల్పోవడం తీవ్ర బాధని మిగిల్చిందని అన్నం సతీష్ తెలిపారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నానని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడుని కోరుకున్నట్లు చెప్పారు. సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. అందుబాటులో లేని కారణంగా చరవాణి ద్వారా కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేసినట్లు చెప్పారు. సత్యనారాయణ అంత్యక్రియలలో పాల్గొంటున్నట్లు తెలిపారు.


# యాజలి గ్రామ అభివృద్ధి ప్రధాత గుండ్రేడ్డి సత్యనారాయణ మృతి పట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు దిగ్భ్రాంతి

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** కర్లపాలెం మండలం యాజలి గ్రామ అభివృద్ధి ప్రధాత, ప్రముఖ దాత గుండ్రేడ్డి సత్యనారాయణ అనారోగ్య సమస్యలతో శివైక్యం చెందడం పట్ల బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) వేగేశన నరేంద్ర వర్మ రాజు తీవ్ర దిగ్భ్రాంతిని, ప్రగాఢ సంతాపంను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ యాజలి గ్రామంలో జన్మించి, తన గ్రామంపై ఉన్న మమకారంతో దాని అభివృద్ధికి సత్యనారాయణ అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. యాజలి స్మశాన వాటిక అభివృద్ధి కోసం ఏకంగా కోటి రూపాయల భారీ విరాళం ప్రకటించి, ఆ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నిలిపారని గుర్తుచేసుకున్నారు. అటువంటి గొప్ప దాత, సేవామూర్తి మరణం యాజలి గ్రామానికి, బాపట్ల నియోజకవర్గానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సత్యనారాయణ అందించిన సేవలను యాజలి గ్రామ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. గుండ్రేడ్డి సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ సమయంలో వారికి భగవంతుడు ధైర్యాన్ని చేకూర్చాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆకాంక్షించారు

# పారిశ్రామికవేత్తలుగా పౌల్ట్రీ రైతులు

(మొదటి పేజీ తరువాయి)



**కుప్పం, సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** కుప్పం నియోజకవర్గంలోని పౌల్ట్రీ రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో వాతావరణ అనుకూల (ఎన్విరానమెంటల్లీ కంట్రోల్డ్) పౌల్ట్రీ షెడ్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడానికి కార్యాచరణ చేపట్టినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. కుప్పంలోని పౌల్ట్రీ రైతులతో సీఎం చంద్రబాబు మంగళవారం ముఖాముఖీ అ–య్యారు. పౌల్ట్రీ రంగ అభివృద్ధి, రైతులకు అందుతున్న అవకాశాలు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై ఈ ముఖాముఖిలో చర్చించారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ఎన్విరానమెంటల్లీ కంట్రోల్డ్ పౌల్ట్రీ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. రైతులను కేవలం పౌల్ట్రీ సాగుదారులుగా కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా చేయాలన్న లక్ష్యంతో ఐబీ గ్రూప్‌తో కలిసి ఈసీ పౌల్ట్రీ షెడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**పౌల్ట్రీ రంగానికి ప్రత్యేక పాలసీ :** రైతులు ఎంఎస్ఎంఈలుగా ఎదగాలన్న ఉద్దేశంతో కుప్పంలో పెద్ద ఎత్తున ఈ తరహా పౌల్ట్రీ షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఇందుకు అవసరమైన అన్ని అనుమతులను రియల్ టైమ్‌లో మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పౌల్ట్రీ రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు ప్రత్యేకమైన పాలసీని తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. డైరీ, పౌల్ట్రీ, ఉద్యానవనం, సెరీకల్చర్ వంటి రంగాలను ప్రోత్సహిస్తూ రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల్లో ఆహారపు అలవాట్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రొటీన్ అధికంగా ఉండే కోడిమాంసం, గుడ్ల వినియోగం పెరుగుతోందని చంద్రబాబు తెలిపారు. దీంతో పౌల్ట్రీ రంగానికి భవిష్యత్‌లో మరింత డిమాండ్ ఉండే అవకాశం ఉందన్నారు. కుప్పంలో ఉత్పత్తి అయ్యే పౌల్ట్రీ ఉత్పత్తులను వేగంగా ఇతర ప్రాంతాలకు తరలించేలా రోడ్డు, రైలు కనెక్టివిటీని పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. పెరుగుతున్న కనెక్టివిటీతో కుప్పం బెంగళూరుకు శాటిలైట్ టౌన్‌షిప్‌గా మారిపోయిందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని కుప్పం నియోజకవర్గాన్ని వ్యాపార, పారిశ్రామికవేత్తలకు చిరునామాగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. పౌల్ట్రీతో పాటు డైరీ, ఉద్యాన, సెరీకల్చర్ రంగాల్లోనూ అవకాశలను అందిపుచ్చుకుని రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు.

# పెన్షనర్ల అదనపు క్వాంటం పెంపుపై హర్షం

- **పీఆర్సీ కమిషన్‌కు కూడా వెంటనే జీవో జారీ చేయాలి**
- **జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో డెబ్బై, డెబ్బై ఐదు సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్ పెంచుతూ ప్రభుత్వం జీవో నంబరు 216 జారీ చేయడంపై జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పెంపు డిసెంబర్ రెండు వేల ఇరవై ఆరు నుంచి అమల్లోకి రానుందని తెలిపారు.

డెబ్బై సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు ఏడు శాతం నుంచి పది శాతానికి, డెబ్బై ఐదు సంవత్సరాలు నిండిన వారికి పన్నెండు శాతం నుంచి పదిహేను శాతానికి అదనపు పెన్షన్ పెంచడం పట్ల ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం రెండు వేల ఇరవై రెండులో ఈ ప్రయోజనాన్ని మూడు శాతం తగ్గించిందని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తిరిగి పెంపును అమలు చేయడం అభినందనీయమన్నారు.

ఇదే విధంగా రాష్ట్రంలోని అధిక సంఖ్యలో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పీఆర్సీ కమిషన్‌ను నియమిస్తూ వెంటనే జీవో జారీ చేయాలని షరీఫ్ కోరారు. ఈ నెల ఐదో తేదీన ఇచ్చిన హామీ మేరకు పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.

# వాయుగుండం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
- **జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు**



**శ్రీకాకుళం సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి తుఫాన్ ప్రభావం పై సమీక్షిస్తున్నారు.

వాయుగుండం ప్రభావంపై జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :** ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదుల్లో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రజలు, పశువుల కాపరులు నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకూడదని, వరద నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని కోరారు.

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు :** సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు ఉంటే తమ పరిస్థితిని వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేసి, అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సముద్రంలోకి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని సూచించారు.

తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధికారుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.

వర్షాలు, వరదలు, రహదారుల పరిస్థితి, ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించి సమాచారం లేదా సహాయం అవసరమైన ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని మంత్రి సూచించారు.

జిల్లా కంట్రోల్ రూమ్: 08942–240557

**అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టాలి :** వర్షాలు, వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పింఛన్లకు రూ.33,485 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత, సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 33,485.10 కోట్లు కేటాయించిందన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వివిధ వృత్తులకు చెందిన అర్హులకు నిరంతర సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

62 లక్షల మంది పింఛనుదారుల్లో జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం పరిధిలోని 9.34 లక్షల మంది లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం రూ. 382.82 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. కేంద్ర మార్గదర్శకాల మేరకు ఈ నిధులను అక్టోబర్ ఒకటి నుంచి నేరుగా లబ్ధిదారుల ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. అయితే పింఛను మొత్తంలో ఎలాంటి మార్పు ఉండదని, కేంద్ర వాటా బ్యాంకులో జమ అయినప్పటికీ మిగిలిన రాష్ట్ర వాటాను స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సిబ్బంది ద్వారా యథావిధిగా ఇంటి వద్దే నగదు రూపంలో అందిస్తామని స్పష్టం చేశారు. ఈ విధానం కేవలం 9.34 లక్షల మంది జాతీయ సామాజిక సహాయ కార్యక్రమం లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తుందని, మిగిలిన సుమారు 53 లక్షల మంది ఎన్టీఆర్ భరోసా పింఛనుదారులకు పూర్తి మొత్తాన్ని ఇంటి వద్దే నగదు రూపంలో అందిస్తామని తెలిపారు. కేంద్ర వాటా సజావుగా జమ కావడానికి సంబంధిత లబ్ధిదారులు తమ ఆధార్ అనుసంధానిత పొదుపు బ్యాంకు ఖాతాలను సక్రియం చేసుకోవాలని మంత్రి సూచించారు. పింఛను మొత్తం జమ అయిన వెంటనే లబ్ధిదారులకు సందేశం ద్వారా సమాచారం అందిస్తామని, ఖాతా సక్రియం, ఆధార్ అనుసంధానం లేదా పింఛను చెల్లింపులపై సందేహాలుంటే సమీపంలోని స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయాలను సంప్రదించాలని కోరారు.

# ఘనంగా పూర్వపు మఠాధిపతి వెంకటేశ్వర స్వామి ఆరాధన మహోత్సవాలు



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠంలో 5వ తరం తొమ్మిదవ పూర్వపు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి ఆరాధన మహోత్సవాలను ప్రస్తుత మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఆరాధన మహోత్సవంలో భాగంగా పూర్వపు మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి మునిమనవడు ప్రస్తుత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం మఠాధిపతి శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాముల వారు మఠం ప్రాంగణంలోని వెంకటేశ్వర స్వామి సమాధి వద్ద ప్రత్యేక అభిషేకాలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పూర్వపు మఠాధిపతి చిత్రపటానికి పూజలు చేసి భక్తిశ్రద్ధలతో ఆరాధన మహోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పూర్వపు మఠాధిపతి వెంకటేశ్వర స్వామి ఆధ్యాత్మిక సేవలను స్మరించుకున్నారు. ఆరాధన మహోత్సవంలో మఠాధిపతి సోదరులు దత్తాత్రేయ స్వామి, ఆస్థాన సిద్ధాంతులు, అర్చకులు, పూర్వపు మఠాధిపతి శిష్యులు, భక్తులు, మఠం సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లాలో కాంట్రాక్టు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల శాంతియుత నిరసన



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బాపట్ల జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులు వినూత్న రీతిలో శాంతియుత నిరసన చేపట్టారు. బాపట్ల ఏరియా వైద్యశాలలో భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు యుగళగీతాల ద్వారా తమ ఆవేదనను ప్రభుత్వానికి వినిపించారు.

బాపట్ల జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ సభ్యుడు సత్యం రాజు కూరపాటి ఆధ్వర్యంలో ఈ నిరసన కొనసాగింది. ఉద్యోగులు చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, ప్రత్యేకంగా పాటలు పాడుతూ తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. "ఏమి బ్రతుకులు... చాలీ చాలని జీతం బ్రతుకులు" అంటూ ఉద్యోగులు ఆలపించిన యుగళగీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రోగుల ప్రాణాలు కాపాడేందుకు తాము ముందుంటామని, కానీ తమ జీవితాలను కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ స్టాఫ్ నర్సులు జ్యోతి, నూర్జహాన్ పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ నిరసనలో బహటం నీలిమ, నళిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో 11 ఫిర్యాదులు

- ఆర్డీఓ రమణారెడ్డి



**మిర్యాలగూడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 మంది ఫిర్యాదు చేసినట్లు ఆర్డిఓ ఎస్.రమణారెడ్డి తెలిపారు.మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం 3, మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయం 2, పెద్దవుర తహసీల్దార్ 1, తిరుమలగిరి సాగర్ 1, తహసీల్దార్ త్రిపురారం 1, మిర్యాలగూడ మున్సిపాలిటీ కమీషనర్ 1, విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ ఒక దరఖాస్తు వచ్చినట్టు ఆర్డిఓ తెలిపారు. ప్రజావాణిలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగదీశ్వర్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవరావు, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎండి. అహ్మదుల్లా, ఆదినారాయణ, బిక్షం, డిప్యూటీ తహసీల్దార్ వి. సైదిరెడ్డి, ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు ఆఫీసర్ శాంతి, ఉద్యానవన శాఖాధికారి నసీమా మెహ్రిన్, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్తేరు, హెచ్డబ్ల్యూఓ జానిమియా, నరేష్, విద్యుత్ సబ్ ఇంజనిర్ గోపి, ఎక్సైజు ఎస్ఐ షేక్ పర్వీన్ లు పాల్గొన్నారు.పట్టభద్రుల గొంతుకగా ఎమ్మెల్సీ బరిలో మల్లం వెంకటేశం గౌడ్..

## 52 మంది లబ్ధిదారులకు రూ.47.65 లక్షల సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



**మిర్యాలగూడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.47,65,400 విలువైన సీఎం సహాయనిధి (CMRF) చెక్కులను ఎమ్మెల్సీ శ్రీ కేతావత్ శంకర్ నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సీఎం సహాయనిధి అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ సెల్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి నర్సిరెడ్డి, 25వ వార్డు కౌన్సిలర్ మనోజ్, నాయకులు తలకొప్పుల సైదులు, జవహర్ నాయక్, కొమ్ము దాసు, శ్రీనివాస్, వెంకటరెడ్డి, దైద సురేష్, సేవా నాయక్, విజయ్ పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం..




**యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ మరియు మండల రేషన్ డీలర్లు భువనగిరి మండల అధ్యక్షులు గంగాదేవి మహేష్ ఆధ్వర్యంలో సోమవారం రోజు రేషన్ డీలర్ల సభ్యత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా రేషన్ డీలర్ అధ్యక్షులు ఏలగల రాజన్న, గౌరవ అధ్యక్షులు మన్నె యాదగిరి, జిల్లా కోశాధికారి ఎడ్ల ఉమా దర్శన్ రెడ్డి, భువనగిరి మండల ఉపాధ్యక్షులు చింతల మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి కూరాకుల శ్రీనివాస్, మండల కోశాధికారి నిమ్మల రమేష్, భాగ్యమ్మ శ్రీనివాస్, రాసాల వెంకటేష్, పిట్టల అశోక్, మామిళ్ళ కృష్ణ, జై వాణి వెంకటేష్, ఎడ్ల ఉమా నారాయణరెడ్డి, డి.మంజుల ,అమృతమ్మ, పూస జాంగిం , బుక్య భాస్కర్, బన్సీలాల్, ఎన్. రాజు, కే. బాలకృష్ణ, ఉడుత రమేష్, శివ శంకర్, ఎన్. పోశెట్టి, గణేష్ రావు , ఎం. శేఖర్, నోముల ఆంజనేయులు, బాలు నాయక్ , విద్యా నాయక్ మొదలైన రేషన్ డీలర్లు పాల్గొనడం జరిగింది.

## తహసీల్దార్ కార్యాలయం తరలింపు ప్రయత్నం విరమించుకోవాలి



**మఠంపల్లి, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మఠంపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రస్తుత ప్రాంతం నుంచి ఇతర ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను అధికారులు వెంటనే విరమించుకోవాలని సామాజిక కార్యకర్త గాయం గోవర్ధన్ రెడ్డి కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నోడల్ అధికారి, సూపరింటెండెంట్ కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయాన్ని మండల కేంద్రానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న మరో ప్రాంతానికి తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కార్యాలయం తరలిస్తే మండల ప్రజలు,రైతులతో పాటు వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రెవెన్యూ సేవల కోసం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలు ఒకే ప్రాంతంలో సులభంగా అందుబాటులో ఉండేలా సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయం పరిధిలో ఉన్న పాత తహసీల్దార్ కార్యాలయం స్థలంలోనే నూతన భవనం నిర్మించాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రస్తుత ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కార్యాలయాన్ని తరలించే నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కంటే ప్రజా సౌకర్యానికే అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.మండల ప్రజలకు అనుకూలంగా ఉన్న ప్రస్తుత తహసీల్దార్ కార్యాలయ ప్రాంతంలోనే నూతన భవన నిర్మాణం చేపట్టేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై త్వరలో సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు గాయం గోవర్ధన్ రెడ్డి మీడియాకు తెలిపారు.

## మండల స్థాయి ప్రజావాణికి రెండు రెవెన్యూ దరఖాస్తులు



**మిర్యాలగూడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ శాఖకు సంబంధించిన రెండు దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి నోడల్ అధికారి, ఎంపీడీవో శేషగిరి శర్మ తెలిపారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులపై తగిన చర్యలు తీసుకుని, దరఖాస్తుదారులకు సమాచారం అందించడంతో పాటు తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచిస్తూ సంబంధిత దరఖాస్తులను తహసిల్దార్‌కు పంపించినట్లు ఆయన తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో తహసిల్దార్ పి. శ్రీనివాస్, ఎంపీఓ మాతంగి రమేష్, వ్యవసాయ అధికారి రుషేంద్రమణి, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ స్వప్న, మండల విద్యాధికారి ధర్మానాయక్, అలగడప పీహెచ్‌సీ శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్ల వార్డెన్లు సావిత్రి, నరేష్, తరుణ్ కుమార్, హౌసింగ్ అధికారి నాగులు, ఆర్‌డబ్ల్యూఎస్ మణిదీప్, విద్యుత్ ఏఈ అమర్‌సింగ్, ఈసీ కళావతి, ఏపీఎం దిలీప్, లైబ్రేరియన్ సుధీర్ తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 500 ఎకరాలకు సాగునీరు అందేలా వచ్యా తండా వాటర్ లిఫ్ట్ పునఃప్రారంభం

◆ రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక చొరవ



**మిర్యాలగూడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** దామరచర్ల మండలం వచ్యా తండా పరిధిలోని వాటర్ లిఫ్ట్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కొన్ని నెలల క్రితం చోరీకి గురికావడంతో లిఫ్ట్ మోటార్లు పనిచేయకపోయాయి. దీంతో సుమారు 500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దృష్టికి రావడంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించారు. అయితే ప్రస్తుత పంటలకు మరో మూడు నెలల పాటు సాగునీరు అత్యవసరంగా అవసరమున్న నేపథ్యంలో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే నీటిని అందించేందుకు ఎమ్మెల్యే తన సొంత ఖర్చుతో నెలకు రూ.1 లక్ష చొప్పున అద్దె చెల్లిస్తూ తాత్కాలిక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ క్రమంలో సోమవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సతీమణి బత్తుల మాధవి, వారి తనయులు బత్తుల ఈశ్వర్, గణేష్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ చేసి వాటర్ లిఫ్ట్‌ను పునఃప్రారంభించారు. దీంతో లిఫ్ట్ పరిధిలోని సుమారు 500 ఎకరాల పంటలకు వెంటనే సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. వాటర్ లిఫ్ట్ పునఃప్రారంభం కావడంతో పంటలు చేతికందే పరిస్థితి ఏర్పడిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. తమ సాగునీటి సమస్యను అత్యవసరంగా పరిష్కరించేందుకు స్పందించి, అధికారులతో సమన్వయం చేస్తూ నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించడంతో పాటు, తాత్కాలికంగా తన సొంత ఖర్చుతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ లావూరి సుజాత రవినాయక్, సర్పంచ్‌లు సైదా నాయక్, మంగత్యా నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొర్ర నాగు నాయక్, కాంగ్రెస్ నాయకులు రవితేజ, గాజుల శ్రీను, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన

# నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి,నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్ రెడ్డి

○ చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి





**సదాశివపేట, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన చంద్రశేఖర్ రెడ్డి, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణంలోని రామ్‌నగర్ రామ్ మందిర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డిని జగ్గారెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. నిర్మలా జగ్గారెడ్డి డీసీసీ అధ్యక్షురాలిగా ఏడు సంవత్సరాలకు పైగా సుదీర్ఘకాలం పనిచేశారని తెలిపారు. ఆమె హయాంలో జిల్లా కేంద్రంలో ఏ విధంగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించామో, అంతకంటే ఎక్కువగా చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. చంద్రశేఖర్ రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని జగ్గారెడ్డి సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు.

**సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు:**

చంద్రశేఖర్ రెడ్డినూతన డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ. తనను డీసీసీ అధ్యక్షుడిగా ఎంపిక చేయడంలో సహకరించిన మంత్రి దామోద ర్ రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.నిర్మలా జగ్గారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆమె మాదిరిగానే అందరితో సమన్వయం చేసుకుంటూ పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

**అధిష్టానానికి కృతజ్ఞతలు:** ఎమ్మెల్యే సంజీవరెడ్డినారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఏఐసీసీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే చంద్రశేఖర్ రెడ్డి ఎంపికకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ, జగ్గారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

# తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని బీఆర్ఎస్ దోపిడీ..

◆ ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య.



**యాదాద్రి భువనగిరి, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని అధికారాన్ని అనుభవించి, రాష్ట్రంలో ఉన్న సంపదను దోచుకున్నారని ప్రభుత్వ విప్ , ఆలేరు శాసన సభ్యులు బీర్ల అయిలయ్య విమర్శించారు. షాబాద్ మండలం మద్దూరు గ్రామంలో బీఆర్ఎస్ మాజీ మంత్రి , ప్రస్తుత సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ఫామ్ హౌస్ వద్దకు ఎంపీలు , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు , కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ పలు అంశాలను వెల్లడించారు.పేద ప్రజలకు చెందిన ఇనామ్ భూములు , సీలింగ్ భూములను ఏ విధంగా ఆక్రమించు కున్నారో..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వివరించారని తెలిపారు. అదే క్రమంలో ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎంపీలు , ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీల ఆస్తులు , వారి భూ వ్యవ హారాల పై నాలుగో రోజు కూడా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వాస్త వాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ నేతల ఫామ్‌హౌస్‌ల చరిత్రను కూడా ప్రజల కు వివరిస్తామని బీర్ల అయిలయ్య తెలిపారు. జగదీశ్ రెడ్డి 2009 ఎన్నికల్లో పోటీ చేసిన సమయంలో తన ఎన్నికల అఫిడవిట్‌లో రూ.12 లక్షల ఆస్తులు చూపించారని , 2014 నాటికి అవి రూ.1.03 కోట్లకు పెరిగాయని పేర్కొన్నారు. ఇంత భారీగా ఆస్తులు ఎలా పెరిగాయో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి పేదలకు భూములు పంపిణీ చేసిన చరిత్ర ఉందని బీర్ల అయిలయ్య అన్నారు. అయితే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ముసుగులో వేల కోట్ల రూపాయల ఆస్తులు , వందల ఎకరాల భూములు ఎలా సమ కూర్చుకు న్నారో. .ప్రజలకు వివరించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నేతలపై ఉందని అన్నారు. "జగదీశ్ రెడ్డి..నువ్వు ఉన్నది మూడు అడుగు లైతే తొమ్మిది అడుగులు ఎగిరి మాట్లాడుతున్నావు. ముఖ్యమంత్రి , మంత్రుల పై అవాకులు చవాకులు మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త" అని బీర్ల అయిలయ్య హెచ్చ రించారు. అక్రమంగా ఆక్రమించు కున్న భూములను గుర్తించి, అర్హులైన పేద ప్రజలకు అందించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రజా క్షేత్రంలో వాస్తవాలను ఎండగట్టి ప్రజల ముందు ఉంచు తామని స్పష్టం చేశారు.బీఆర్ఎస్ నేతల భూ వ్యవహారాలు , ఫామ్ హౌస్‌ల నిర్మాణాల పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకు రావాలని బీర్ల అయిలయ్య డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు బుద్ధి తెచ్చుకుని ప్రజా పాలన లో నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని బీర్ల అయిలయ్య సూచించారు.

## రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి

◆ ప్రత్యేక క్యాంపెయిన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

◆ మండల వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమని



**మిర్యాలగూడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** రైతు పథకాలు, మద్దతు ధర, ఎరువులు, పంట రుణాలు తదితర ప్రభుత్వ వ్యవసాయ సేవలు, పథకాల ప్రయోజనాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలని మిర్యాలగూడ మండల వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమని తెలిపారు. రైతుల సౌకర్యార్థం సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఫార్మర్ ఐడీ నమోదు క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫార్మర్ ఐడీ నమోదు చేసుకునేందుకు రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ ఫోన్ తీసుకుని సమీపంలోని రైతు వేదికలోని ఏఈఓలను లేదా మీ-సేవ కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, సేవలను రైతులకు మరింత సులభంగా అందించేందుకు ఫార్మర్ ఐడీ నమోదు కీలకమని ఎం. రుషేంద్రమని పేర్కొన్నారు. మండలంలోని అర్హులైన ప్రతి రైతు ఫార్మర్ ఐడీ నమోదు చేసుకునేలా ఏఈఓలు పార్వతి, నాగయ్య సమన్వయంతో రైతులకు అవగాహన కల్పిస్తూ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులందరూ సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్‌లో పాల్గొని ఫార్మర్ ఐడీని తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. రుషేంద్రమని కోరారు.

## 400 ఏళ్లనాటి ఖబ్రస్థాన్ పరిరక్షించండి

○ ప్రజావాణిలో కలెక్టర్ కు ఆగామోత్కూర్ ముస్లింల వినతి



**మిర్యాలగూడ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామంలోని పురాతన ముస్లిం ఖబ్రస్థాన్ ను పరిరక్షించాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన ముస్లింలు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 80 ముస్లిం కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, గ్రామ మసీదు వెనుక భాగంలో ఉన్న సేరివాలె ఖబ్రస్థాన్ సుమారు 4 ఎకరాల విస్తీర్ణంలో ఉందని తెలిపారు. ఈ స్థలంలో గత 400 ఏళ్లుగా తమ పూర్వీకులు, ముత్తాతలు, తాతలు, తల్లిదండ్రుల సమాధులు ఉన్నాయని, కుతుబ్ షాహీ కాలం నుండి ఇది ముస్లింల ఖబ్రస్థాన్ గా వినియోగంలో ఉందన్నారు. పాత రికార్డుల ప్రకారం ఖబ్రస్థాన్ ఇనాం, వక్ఫ్ భూమిగా కొనసాగుతోందన్నారు. అయితే అదే గ్రామానికి చెందిన ఎండి. జాఫర్, ఎండి. అజీజ్, ఎండి.ఖలీల్ అనే వ్యక్తులు ఈ ఖబ్రస్థాన్ భూమిపై తమకే హక్కు ఉందని చెబుతూ ఖబ్రస్థాన్ స్థలాన్ని, రాకపోకల మార్గాన్ని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకుని గ్రామస్థులు నిలదీయగా సదరు వ్యక్తులు దూషిస్తూ గొడవకు దిగడంతో పాటు దాడికి ప్రయత్నించారని, దీంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయని వాపోయారు. ఈ విషయాన్ని అత్యవసరంగా పరిగణించి ఖబ్రస్థాన్ భూమి రికార్డులను పరిశీలించి వక్ఫ్ భూమిగా నిర్ధారించి సర్వే చేయించి హద్దులు నిర్ణయించి, అక్రమ విక్రయాలు, రిజిస్ట్రేషన్లను నిలిపివేసి పరిరక్షించాలని కలెక్టర్ తో పాటు జిల్లా ఎస్పి, జిల్లా వక్ఫ్ బోర్డ్ అధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో ఆగామోత్కూర్ గ్రామ ముస్లింలు మహ్మద్ యూసుఫ్, ఎండి.గౌస్ మియా, ఎండి.మధార్, అహ్మద్, ఎండి యూసుఫ్ పాషా, ఉస్మాన్ మహ్మద్, ఎక్బాల్, ఎండి అమీర్, ఎస్కే ఖలీల్, ముజిబ్, ఎండి.జానిమియా, ఎస్కే అహ్మద్, మహ్మద్ షౌకత్, ఎండి నజీర్, మహ్మద్ గౌస్, ఎస్ కే షరీఫ్, షహీద్, ఇమామ్, మొహమ్మద్ హుస్సేన్, నసీర్ పాల్గొన్నారు.

# మెదక్‌ను నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం

○ అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం

○ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు




**మెదక్, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** మెదక్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.సోమవారం మెదక్ పట్టణంలోని మంజీరా గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్య, వైద్యం తదితర రంగాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలను గుర్తించి స్మార్ట్ రేషన్ కార్డులు అందించే ప్రక్రియ చేపట్టిందన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, కౌన్సిలర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం

- అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి
- ఎల్‌నినోప్రభావంతో వర్షాభావ పరిస్థితులు
- పంటలను కాపాడేందుకు గోదావరి జలాల వినియోగం
- కుమ్మరిపాడులో హైలెవల్ బ్రిడ్జి, బీటి రోడ్డును ప్రారంభించిన మంత్రి తుమ్మల



**ములకలపల్లి, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసాకల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్రవ్యవసాయ,సహకార, మార్కెటింగ్, చేనేత శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి సోమవారం పరిశీలించారు.



యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి టన్నెల్‌నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలుఅడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింద భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్,కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు.టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంతప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. టన్నెల్‌కుసంబంధించిన మిగిలిన పనులను 25రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో పనులు పూర్తి చేసి సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డిఎఫ్ నిధులతో 4కోట్ల63లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హైలెవల్ బ్రిడ్జి, బీటి రోడ్డును మంత్రి ప్రారంభించారు.గ్రామీణప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతోపాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందు బాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకం లోని మూడో పంప్‌హౌస్‌ను పరిశీలించారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలనిసూచించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపలి ట్రంక్‌కుగోదావరి జలాలను అందించాలన్నది సిఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కునీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణ కు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామన్నారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48కోట్లు విడుదలచేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం కలెక్టర్ ప్రతిపాదన లుపంపితే అవసరమైన నిధులనుకూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటం, ఎల్‌నినో ప్రభావం వంటి కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడేఅవకాశంఉందని మంత్రి అన్నారు. రైతులుసాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకోని ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతంచేయాలని మంత్రి తెలిపారు.ప్రధాన కాలువలతోపాటు అవసరమైన చోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటినినేరుగా రైతులపొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానికప్రజాప్రతినిధులు వారానికోసారిసమీక్ష నిర్వహించాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎక్కడా పనులు నిలిచిపోకూడదని , ఏదైనాసమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలన్నారు. భద్రాద్రి జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని తెలిపారు. నుసందానానికిసంబంధించి పాండురంగాపురం- మణుగూరు మార్గం, భద్రాచలం వైపురైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్రప్రభుత్వంతో సమన్వం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయన్నారు. సీతారామప్రాజెక్టు పూర్తయితే ఈప్రాంతంలోని వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకోని ప్రాజెక్టు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట మాజీ జెడ్పీటిసి పైడి వెంకటేశ్వరరావు, సంబంధిత ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్సీ,ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- భద్రాద్రి జిల్లా పవిత్రమైన ప్రాంతం
- భద్రగిరి మార్ట్ ఏర్పాటు ఆదర్శనీయం
- ల్యాండ్, సర్వీస్ అట్రాసిటీస్ అంశాలపై సమీక్ష
- ఎస్సీ,ఎస్టీ బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరించిన రాష్ట్ర కమిషన్ చైర్మన్



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని,అందుకోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తూ, రక్షణ చట్టాలను రూపొందించిందని తెలంగాణ రాష్ట్రషెడ్యూల్‌కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. భద్రాద్రి జిల్లా ఐడిఓసిలో ల్యాండ్, సర్వీస్(ఆర్ఓఆర్), అట్రాసిటీస్ అంశాలపై సోమవారం అధికారులతో సమీక్షా సమావేశం ముగ్గురు కమిషన్‌సభ్యులతో కలిసి నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోనే విస్తీర్ణంలో అతిపెద్ద ఏజెన్సీ జిల్లా భద్రాద్రి జిల్లా అని గుర్తు చేశారు. కమిషన్ సమావేశానికి జిల్లాకు రెండోసారి రావడం జిల్లా అధికారులు ఘనస్వాగతం పలకడం మర్చిపోలేని సంఘటనన్నారు. రాష్ట్రప్రభుత్వం ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతి కోసం ఎన్నోసంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని అందిపుచ్చుకోని ఆర్థికంగా దినదినాభివృద్ధి చెందాలని సూచించారు. వివిధ శాఖల్లో పని చేస్తున్నప్రభుత్వం ఎస్సీ,ఎస్టీల భూమి సమస్యలు, బ్యాక్‌లాగ్ పోస్టులు వివరాలు, ఉద్యోగులు రక్షణ కోసం చట్టాలను, రోస్టర్ విధానాలు, రూపొందించి వాటిని పకడ్బందీగా అమలుచేసేందుకు కమిషన్ చర్యలు చేపడుతుందని గుర్తు చేశారు. ఎస్సీ,ఎస్టీ ప్రజలపైన ఉద్యోగులపైన ఎటువంటి వేధింపులు, ఇబ్బందులకు గురి చేసినా శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. న్యాయం కోసం దరఖాస్తు చేసుకున్న ఎస్సీ,ఎస్టీ బాధితులకు ఎఫ్ఐఆర్, చార్జిషీట్, కమిషన్, కంపన్సేషన్ వరకు పారదర్శకంగా ఉండేందుకు అధికారులు పని చేయాలని ఆదేశించారు. భద్రాద్రి జిల్లాకు శ్రీసీతా రామచంద్రస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని, ఎన్ని సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం ఆ రాములోరి దయ వలన సత్వరమే తీరిపోతాయని చైర్మన్ అన్నారు. దక్షిణ అయోధ్యగా పేరు గడించిన భద్రాచలం పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం ఎంతో భాగ్యమన్నారు. వివిధ శాఖల అధికారుల నుంచి వివరాలతోపాటు ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులనివేదిక చైర్మన్ అడిగి తెలుసుకున్నారు.ఈక్రమంలో జిల్లా పోలీస్‌శాఖ నివేదికను కమిషన్ చైర్మన్ అడుగగా 2014 నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 1115ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు వివరించారు. అందులో 51కేసులు ప్రస్తుతం విచారణలో ఉన్నాయని, వాటిలో 20కేసులో ఛార్జింగ్ చార్జిషీట్ చేశామని, రెండు హైకోర్టు స్టేలు ఉండగా, 9కేసులు లీగల్ ఓపీనియన్ కోసం ఉన్నాయని, 20పెండింగ్ కేసులు ప్రస్తుతం ఉన్నట్లు ఎస్పీ వివరించారు. జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ, జిల్లా పంచాయతీ డిఆర్‌డిఓ, ఎస్సీ కార్పొరేషన్, గురుకులాల, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ, జిల్లాప్రజా పరిషత్, ఉపాధి శాఖ మున్సిపల్‌శాఖ, వ్యవసాయశాఖ, పరిశ్రమలు, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, ఎక్సైజ్ జ్యోతిరావుపూలే డిసిఓ, జిల్లా రెవెన్యూ,ఫారెస్ట్, ఐటిడిఏలో నమోదైన ఎస్సీ,ఎస్టీ కేసుల వివరాలు ఉద్యోగుల సమస్యలు ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సంఖ్య భర్తీ కానీ బ్యాక్లాగ్ పోస్టుల వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ,ఎస్టీల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వారి అభ్యున్నతే లక్ష్యంగా వివిధ పథకాల అమలుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. మండల తహశీల్దార్లు, ఎంపిడిఓలు, సిడిపిఓలు సమన్వయంతో జిల్లా అధికారులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి న్యాయం కోసం ఎదురు చూస్తున్న బాధితుల కోసం పని చేయాలని ఆదేశించారు. భద్రాద్రి గిరిమార్ట్ ఏర్పాటు ఆదర్శనీయమని చైర్మన్ ఐటిడిఏ పిఓ రాహుల్ ను అభినందించారు.న్యాయం కోసం వచ్చిన ఎస్సీ,ఎస్టీబాధితుల నుంచి కమిషన్ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంబాబునాయక్, నీలాదేవి, డిబిఎఫ్ శంకర్‌లతో కమిషన్ చైర్మన్ దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు రిఫర్ చేసి ఎటువంటి నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించకుండా తక్షణమే సమస్యలు పరిష్కారం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డిఆర్ఓ పద్మావతి, సిపిఓ సునీత, జిల్లా షెడ్యూలు కులముల అధికారిని శ్రీలత, కార్పొరేషన్ ఈడి ఉపేందర్, జడ్పీ సీఈఓ నాగలక్ష్మీ, డిపిఓ అనూష, డిఏఓ బాబురావు, విద్యుత్‌శాఖ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింగరేణి ఇళ్ల పట్టాలపై కాంగ్రెస్ డ్రామాలు

- జీవో 76 పేరిట కమిటీల నాటకం,
- కేసీఆర్ హయాంలోనే 30 వేల మందికి ఇళ్ల పట్టాలు..
- సింగరేణి కుంభకోణాలపై సీబిఐ విచారణకు కొప్పుల ఈశ్వర్,కోరుకంటి చందర్ డిమాండ్



**గోదావరిఖని, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖని కేంద్రంగా సింగరేణి కార్మికుల సొంతింటి కల, భూముల హక్కుల అంశంపై బీఆర్ఎస్ నాయకత్వం కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడింది.సోమవారం,గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో టిబిజికేఎస్ గౌరవ అధ్యక్షులు,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,టిబిజికేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు.

కేసీఆర్ నాయకత్వంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నెంబర్ 76, జీవో 29ల ద్వారా సింగరేణి వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో దశాబ్దాలుగా నివాసముంటున్న దాదాపు 30,000 మంది కార్మికులు,స్థానిక ప్రజలకు ఇళ్ల పట్టాలను విజయవంతంగా అందించిందని కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. అప్పట్లో దరఖాస్తు చేసుకుని ఫీజులు చెల్లించిన అర్హులందరికీ హక్కులు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనని, ఇప్పుడు మళ్లీ ఎన్నికల ప్రయోజనాల కోసం కాంగ్రెస్ నేతలు కమిటీల పేరుతో కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ పాలనలో సింగరేణి సంస్థను తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నారని, సోలార్ టెండర్లు, ఓబీ కాంట్రాక్టులు, బొగ్గు నిల్వల అవకతవకలతో వేల కోట్ల కుంభకోణాలకు పాల్పడుతున్నారని కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. కార్మికుల సంక్షేమాన్ని పక్కనపెట్టి, మెడికల్ బోర్డులను నీరుగార్చడం వల్ల వారి ఆరోగ్యం గాలిలో దీపంగా మారిందని,ఈ కుంభకోణాలపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.అనంతరం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ,అర్హులకు పట్టాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమైతే గతంలో మిగిలిపోయిన ప్రక్రియను కొనసాగించాలి తప్ప, కొత్త కమిటీలతో కాలయాపన చేయడం పచ్చి వంచన అని ధ్వజమెత్తారు.ఒకవైపు చిన్న వ్యాపారుల షాపులు, ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తూ,మరోవైపు కొత్తగా పట్టాలు ఇస్తామని చెప్పడం కాంగ్రెస్ ద్వంద్వ విధానాలకు నిదర్శనమని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వ చిల్లర రాజకీయాన్ని, మోసపూరిత వైఖరిని సింగరేణి ప్రాంత ప్రజలంతా గమనించి తగిన రీతిలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్,టిబిజికేఎస్ ముఖ్య నాయకులు,కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు,పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ విమర్శల అస్త్రం

- 'డైవర్షన్ పాలిటిక్స్'పై 'వ్యాల్ల హరీష్ రెడ్డి' ధ్వజం

**గోదావరిఖని, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల హరీష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.సోమవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజాసమస్యల పరిష్కారం, హామీల అమలును డిమాండ్ చేస్తూ నిరసన తెలపడం ప్రతిపక్షాల హక్కు అని పేర్కొన్న ఆయన, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హామీల నినాదాలతో కూడిన టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళ్తే మార్షల్స్‌తో అడ్డుకోవడం

దారుణమన్నారు.ఢిల్లీ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ టీషర్టులు ధరించి నిరసన తెలిపితే సరైనది అయినప్పుడు,తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు టీషర్టులు ధరిస్తే తప్పెలా అవుతుందని నిలదీశారు.కాంగ్రెస్ నేతల ద్వంద్వ నీతికి ఈ ఘటన స్పష్టమైన నిదర్శనమని విమర్శించారు.గతంలో

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి,మాజీ సీఎం కేసీఆర్‌పై విచక్షణారహితంగా ఆరోపణలు చేశారని హరీష్‌రెడ్డి గుర్తుచేశారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు, 800 ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ప్రచారం చేసిన రేవంత్‌రెడ్డి, ఇటీవల అసెంబ్లీ సాక్షిగా కేవలం 66 ఎకరాలు మాత్రమే ఉందని పేర్కొనడం ద్వారా తన పాత ఆరోపణలు అబద్ధాలని తానే ఒప్పుకున్నట్లయిందన్నారు.దళితుల అసైన్డ్ భూములు కేసీఆర్ అధీనంలో ఉన్నాయని చెప్పడం కూడా ప్రజలను తీవ్రంగా తప్పుదోవ పట్టించడమేనని మండిపడ్డారు.ఇక సింగరేణి ప్రాంత ప్రజలు,కార్మికుల ప్రయోజనాల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం జీఓ 76 తీసుకువచ్చి,భూముల్లో ఇళ్లు నిర్మించుకునేలా వెసులుబాటు కల్పించిందని తెలిపారు.కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 22ఏ తీసుకువచ్చి సామాన్య ప్రజలను, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు.జీఓ 22ఏ సాకుతో భూ యజమానుల నుంచి



ఏకంగా 30 శాతం వాటాను తీసుకునే కుట్ర జరుగుతోందని, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ దందా, భూదందాలకు ప్రభుత్వం ప్రత్యక్షంగా పాల్పడుతోందని విమర్శించారు.అసలు సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించినా,ప్రజలు కాంగ్రెస్ నైజాన్ని గ్రహిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు ఐత శివ కుమార్,బక్కి కిషన్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాహీద్ పాషా,పోలాడి శ్రీనివాస్, బూరుగు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# విద్యకు నిధులు.. విద్యార్థులకు పౌష్టికాహారం



**ఓదెల, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆదాబ్ హైదరాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అల్పాహార కార్యక్రమాన్ని సోమవారం ఓదెల తెలంగాణ మోడల్ స్కూల్‌లో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు.ఈ సందర్భంగా విజయరమణారావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచడంతోపాటు ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో రూ.65 కోట్లతో ప్రహరీలు, అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మిగిలిన పనులను ఏడాదిలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

విద్యారంగంలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ వనజ నాయక్, ఎంఈఓ రమేష్, ఎంపీడీవో అనిల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ శిరీష, ఓదెల సర్పంచ్ కనికి రెడ్డి సతీష్, ఆళ్ల సుమన్ రెడ్డి, ఆకుల మహేందర్ మరియు ఇతర స్థానిక నాయకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు చూస్తే రోత రోత.. జారీ పడితే తప్పదు బురదలో ఈత



**ముస్తాబాద్ సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ముస్తాబాదు నుండి దుబ్బాకు వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్ అంతా బురద గుంతలు ఉండడంతో అటు ఇటు వైపుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ముఖ్యంగా రోడ్డు ప్రక్కనే జడ్.పి.హెచ్.ఎస్ ప్రభుత్వ పాఠశాల ఉండడంతో పాఠశాలకు వెళ్లే విద్యార్థిని విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం సుమారు పది మీటర్ల పొడవు బురద గుంటలు ఉండడంతో సైకిల్పై మరియు కాలినడకన వచ్చే విద్యార్థులు అటు ఇటుగా వెళ్తున్నా వాహనాలను చూసి బెదిరిపోతుర్రు ధరించిన స్కూల్ యూనిఫామ్స్ కు వాహనాల వేగానికి బురద చిల్లుతోందన భయం భయంగా రోడ్డు దాటేస్తున్నారు అయితే ప్రభుత్వాలు మారినా ప్రజల రాత మారదు అన్నట్టుగా నాడు బి ఆర్ ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించినప్పటికీ ఈ రోడ్డు విషయంలో చేసింది ఏమీ లేదు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ఈ దారి గురించి పట్టించుకున్నది ఏమీ లేదు మరి ఇప్పుడు ముస్తాబాద్ మండల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కేంద్ర ప్రభుత్వం అయినటువంటి బీజేపీ పార్టీ ఉన్నప్పటికీ మార్చేది ఏమీ లేదు అయితే ఇప్పుడు మండలంలో మూడు ప్రధాన పార్టీల నాయకులు ఉన్నప్పటికీ ఈ రోడ్డు విషయంలో పట్టింపు లేదు అని ప్రజలు మరియు ప్రయాణికులు వాపోతున్నారు...

# దివ్యాంగ విద్యార్థులకు అండగా భవిత కేంద్రం

- యూనిఫామ్స్, బూట్లపంపిణీ
- ఫిజియోథెరపీ సేవలను పరిశీలించిన సిఎంఓ రామారావు



**కొత్తగూడెం సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిసమగ్ర అభివృద్ధికి అవసరమైన విద్య,వైద్య సేవలను అందించేందుకు భవిత కేంద్రాలు కీలకంగా పని చేస్తున్నాయని సిఎంఓ రామారావు అన్నారు. మండలంలోని భవిత కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి, దివ్యాంగ విద్యార్థులకు నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంప్‌ను పరిశీలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్, బూట్లు పంపిణీ చేశారు. కేంద్రంలో ప్రతి సోమ, గురువారాల్లో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలు, విద్యార్థుల పురోగతి, వారికి అందుతున్న ప్రత్యేక విద్యా బోధనపైసిబ్బందిని వివరాలుఅడిగి తెలుసుకున్నారు. ఐఈఆర్‌పిలు శ్రీరామ్, అరుణ అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకుసరైన సమయంలో ఫిజియోథెరపీతోపాటు నాణ్యమైన విద్య అందిస్తే వారు అన్ని రంగాల్లో రాణించగలరన్నారు. భవిత కేంద్రానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజయోథెరపిస్ట్ శ్రీలత, ఐఈఆర్‌పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# గురుకుల టెండర్ల అక్రమాలపై ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు

**పాల్వంచ, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** గురుకుల టెండర్లలో జరుగు తున్న అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై స్వేరోస్ ప్రతినిధులు సోమవారం తెలంగాణ రాష్ట్రషెడ్యూల్ కులాల, తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలెక్టర్‌కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు కేసరి రవిందర్, ఉపాధ్యక్షుడు వానపాకుల నాగరాజు పాల్గొన్నారు.



# గులాబీమయమైన బోనకల్,హోరెత్తిన భారీ బైక్ ర్యాలీ

- కాంగ్రెస్ రాజ్యంలో కౌరవ పాలన,బిఆర్ఎస్ హయాంలో స్వర్ణయుగం
- బోనకల్ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన లింగాల కమల్ రాజు
- బోనకల్ బీఆర్ఎస్ కార్యాలయం జనతా గ్యారేజ్.. ప్రజల కోసం పనిచేసే పోరాట కేంద్రం :- లింగాల కమల్ రాజు









**బోనకల్, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** బోనకల్ బీఆర్ఎస్ నూతన మండల పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవంతో బోనకల్ పట్టణం గులాబీమయమైంది. బీఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని నూతన పార్టీ కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రావినూతల నుండి బోనకల్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీతో పుర వీధులు హోరెత్తాయి.. గులాబీ జెండాలు రెపరెపలాడుతుండగా, పార్టీ నినాదాలతో ప్రధాన వీధులు మార్మోగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సభలో లింగాల కమల్ రాజు మాట్లాడుతూ బోనకల్‌లో ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం కేవలం పార్టీ కార్యకలాపాలకు పరిమితమైన కార్యాలయం కాదని, ప్రజల కోసం పనిచేసే "జనతా గ్యారేజ్", ప్రజా సమస్యలపై పోరాడే పోరాట కేంద్రంగా ప్రజల పక్షాన ఉంటుందని అన్నారు.ప్రజలు తమ సమస్యలతో ఎప్పుడైనా పార్టీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పార్టీ నాయకులు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిపై అవసరమైన పోరాటాలు నిర్వహించేందుకు ఈ కార్యాలయం కేంద్రంగా నిలుస్తుందని చెప్పారు"ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలను నయవంచన చేశారని,ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు అని కమిషన్లతో కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు.ప్రజల సమస్యలు, రైతులు, యువత, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం మరింత స్పష్టతతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు విషయంలో ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే,తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి కోరుకుంటున్నారు అని కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని కమల్ రాజు అన్నారు.కేసీఆర్ పాలనలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవాలని, ప్రతి గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.బోనకల్ నూతన పార్టీ కార్యాలయం ద్వారా మండలంలోని ప్రతి గ్రామంతో పార్టీకి మరింత బలమైన అనుసంధానం ఏర్పడుతుందని కమల్ రాజు అన్నారు. ప్రజలకు అన్యాయం జరిగిన ప్రతిసారీ బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల పక్షాన నిలబడతాయని స్పష్టం చేశారు"ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా ఉంటాం.. ప్రజలకు అండగా నిలుస్తాం.. అవసరమైతే ప్రజల కోసం రోడ్డెక్కి పోరాటం చేస్తాం" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి బానోత్ కొండ, గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి, పార్టీ మండల నాయకులు పారప్రసాద్, వేమూరి ప్రసాద్ ,జంగా రవి, మోదుగుల నాగేశ్వరరావు, బంధం నాగేశ్వరరావు, కాకాని శ్రీనివాసరావు ,గద్దల వెంకటేశ్వర్లు ,ఇటికాల శ్రీనివాసరావు ,చొప్పకట్లపాలెం హుస్సేన్ భాయ్, ఆలపాడు సర్పంచ్ నాగేశ్వరరావు, లక్ష్మీపురం సర్పంచ్ బోనకల్ సర్పంచ్ తన్నీరు పుల్లారావు, వడ్డే నరేష్, కొనకంచి నాగరాజు, జెర్రిపోతుల రవి, గుండపునేని సుధాకర్ ,చావా హనుమంతరావు ,బెజవాడ మల్లికార్జున్ ,కొమ్మినేని ఉపేందర్, మడావత్ సైదా నాయక్, తేలూరు రమేష్, యార్లగడ్డ రమేష్, మోర్ల శ్రీను, గంగుల పుల్లయ్య, మరిదు శేషు, షేక్ మేరా సాహెబ్, యోగి శ్రీనివాస్, తాళ్లూరు జ్యోతి, జర్పుల లావణ్య, గ్రామ శాఖ సభ్యులు ,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు

# అనంతారంలో అల్జీమర్స్‌పై అవగాహన కార్యక్రమం

- మతిమరుపు లక్షణాలను తొలిదశలో గుర్తించి వైద్యులను సంప్రదించాలి: ప్రాజెక్ట్ ఇన్‌చార్జి







**శామీర్‌పేట, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అల్జీమర్స్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐజీఎఫ్ స్వచ్ఛంద సంస్థ, దాట్ల ఫౌండేషన్ బయోలాజికల్ ఈ లిమిటెడ్ సంస్థ సహకారంతో అనంతారం వార్డులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఐజీఎఫ్ శామీర్‌పేట ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎల్లబోయిన సాంబరాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా సాంబరాజు మాట్లాడుతూ.. అల్జీమర్స్ వంటి తీవ్రమైన మతిమరుపు వ్యాధిపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మూడు చింతలపల్లి, శామీర్‌పేట మండలాల పరిధిలోని వివిధ వార్డుల్లో అల్జీమర్స్‌పై అవగాహన వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధునిక జీవన విధానంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, మానసిక సమస్యలు, జీవనశైలి వ్యాధులతో పాటు వృద్ధాప్య సమస్యలు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు.అల్జీమర్స్ బారినపడిన వారిలో జ్ఞాపక శక్తి క్రమంగా తగ్గడం, చిరాకు, కోపం, ఆందోళన, ఒకే పనిని పదేపదే చేయడం, కుటుంబ సభ్యులను గుర్తించలేకపోవడం, ఇంటికి వెళ్లే దారి మరిచిపోవడం వంటి లక్షణాలు కనిపించే అవకాశం ఉందన్నారు. ఇటువంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా కుటుంబ సభ్యులు ముందుగానే గుర్తించి వైద్యులను సంప్రదించాలని సూచించారు.గతంలో మెదడును చురుగ్గా ఉంచే పుంజితం, పులిమేక, పచ్చీస్, కైలాసం, పదాలు పూరించడం, చదరంగం, పజిల్స్ వంటి ఆటలు ఆడేవారని, ప్రస్తుతం కూడా వయసుకు తగిన విధంగా ఆలోచనను, జ్ఞాపక శక్తిని పెంపొందించే కార్యక్రమాల్లో వృద్ధులు పాల్గొనాలని సూచించారు. అల్జీమర్స్ బాధితులను భారంగా కాకుండా మానవతా దృక్పథంతో ఆదరించి, వారికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని కోరారు.సంస్థ వైద్యులు డాక్టర్ ఈశ్వర్ నాయక్ మాట్లాడుతూ.. డిమెన్షియా, అల్జీమర్స్ వంటి వ్యాధులకు మెదడు కణాల క్షీణత, జన్యుపరమైన కారణాలు, జీవనశైలి సంబంధిత సమస్యలు తదితర అంశాలు కారణమయ్యే అవకాశం ఉందన్నారు. వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే అవసరమైన పరీక్షలు, చికిత్స ద్వారా లక్షణాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సమతుల పౌష్టికాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, మెదడును చురుగ్గా ఉంచే ఆలోచనా ఆటల్లో పాల్గొనడం, చురుకైన జీవనశైలిని కొనసాగించడం ఆరోగ్యానికి ఉపయోగకరమని వివరించారు.కార్యక్రమంలో అనంతారం వార్డు ప్రజలు ఆకుల బాలరాజ్, ముద్దం పాపిరెడ్డి, సలేంద్రి రాజమల్లయ్య, ముద్దం పెంటమ్మ, కాశిపురి కృష్ణాచారి, బలిపురం ఎల్లమ్మ, బత్తిని భారతమ్మ, అమీనా బీ తదితరులు పాల్గొన్నారు. సంస్థ సిబ్బంది పుట్ట గణేష్‌కుమార్, పొన్నబోయిన బాలేష్, ఇల సాగర్ శ్రీకాంత్ పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇల్లు.. ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవం



**ఇల్లందు, సెప్టెంబరు22 (జర్నలిస్ట్ ఫైల్) :** టేకులపల్లి మండలం మూడ్ తండా గ్రామంలో మూడ్ మాలతీ – గోపి దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులకు ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు.ఈ సందర్భంగా మాలతీ – గోపి దంపతులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోరం సురేందర్ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీనగర్‌లో భక్తిశ్రద్ధలతో అన్నప్రసాద కార్యక్రమం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రేగళ్ల సతీష్ రెడ్డి



**కాప్రా , సెప్టెంబరు22 (జర్నలిస్ట్ ఫైల్) :** కాప్రా డివిజన్ గాంధీనగర్‌లో స్టార్ యూత్ బ్రదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నప్రసాద కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజకవర్గం కో–కన్వీనర్ రేగళ్ల సతీష్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయకుడిని దర్శించుకుని, ఉత్సవాలు ప్రశాంతంగా, విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని అందించారు.వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు సేవాభావాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని వారు కోరారు.కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కాప్రా డివిజన్ ప్రతినిధులు నాగునూరి మహేష్, కొప్పుల కుమార్, గడ్డం సత్యనారాయణ, గుండె కృష్ణ, గుడి శ్రీకాంత్‌తో పాటు స్టార్ యూత్ బ్రదర్స్ సభ్యులు వికాస్, అజయ్, రాకేష్, జగదీష్, తేజ, శ్రీకాంత్, మధు, సాయి, పృధ్వి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 111 ఫిర్యాదులు





**నిజామాబాద్, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 111 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు,అదనపు కలెక్టర్ భుజంగరావు,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,డీపీఓ శ్రీనివాస్,ట్రైనీ ఆర్డీఓ సందీప్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రహదారులు, తాగునీరు, సాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



- బాపట్ల జిల్లా డీడీఆర్‌సీ సమావేశంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

**బాపట్ల(జర్నలిస్ట్ ఫైల్):** బాపట్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా కమిటీ సమావేశంలో వేమూరు నియోజకవర్గ శాసన సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. జిల్లాలో చేపట్టిన పనుల పురోగతి, వివిధ శాఖల ద్వారా అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు వివరాలను వెల్లడించారు.

ఈ సందర్భంగా వేమూరు నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు, అభివృద్ధి అవసరాలను నక్కా ఆనందబాబు ఇన్‌చార్జి మంత్రి, జిల్లా కలెక్టర్, సంబంధిత జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపడేలా ఆయా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

వేమూరు నియోజకవర్గ పరిధిలోని అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు, చుండూరు, వేమూరు మండలాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నక్కా ఆనందబాబు కోరారు. ఇప్పటికే ప్రారంభించిన పనుల్లో పెండింగ్‌లో ఉన్న వాటిని గుర్తించి, నిధులు మరియు పరిపాలనా అనుమతులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, సాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

నియోజకవర్గంలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ఓపీఎస్ మార్పునకు విధివిధానాలు వారంలోగా ఇవ్వాలి



- ఆర్థిక శాఖకు ఏపీ ఎన్జీజీవో సంఘం విజ్ఞప్తి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రెండు వేల నాలుగు కంటే ముందు జారీ చేసిన నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాల్లో చేరి, ప్రస్తుతం సీపీఎస్ పరిధిలో ఉన్న ఉద్యోగులను ఓపీఎస్‌లోకి మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, ఇందుకు సంబంధించిన విధివిధానాలను త్వరగా విడుదల చేయాలని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ కోరారు. మంగళవారం సచివాలయంలో ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి గౌతమ్ అల్లాడిని ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణతో కలిసి ఆయన కలిశారు. ఓపీఎస్ అమలుకు సంబంధించిన విధివిధానాల కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్న విషయాన్ని ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లారు. విధివిధానాల రూపకల్పన ఆర్థిక శాఖలో వేగంగా జరుగుతోందని గౌతమ్ అల్లాడి తెలిపారు. వీలైనంత త్వరగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరగా, వారం రోజుల్లోగా విధివిధానాలు విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

రెండు వేల పద్దెనిమిది నుంచి సీపీఎస్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డీఏ బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, కొంతమంది డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు డీఏ బకాయిలను డ్రా చేయలేకపోతున్న విషయాన్ని కూడా ఏపీ ఎన్జీజీవో సంఘం నాయకులు ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లారు. బకాయిల చెల్లింపుల కోసం నిధి పోర్టల్‌లో ప్రత్యేక టైలును అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, దానిని నిర్వహించడంలో ఉన్న సాంకేతిక సమస్యలను తొలగించి దసరాలోపు ఉద్యోగులకు డీఏ బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆర్థిక శాఖ ఆ దిశగా చర్యలు చేపడుతోందని సంయుక్త కార్యదర్శి తెలిపారు. సమావేశంలో ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ జానీ పాషా, రాష్ట్ర కార్యదర్శి ఎల్. రజనీష్ బాబు, ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్.సి.హెచ్. కృష్ణారెడ్డి, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.ఎం. దాస్, రెండు వేల మూడు డీఎస్సీ టీచర్స్ ఫోరం బాధ్యులు శ్రీనాథ్, నయూమ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల అదనపు పింఛను పునరుద్ధరణపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని డెబ్బై, డెబ్బై ఐదు సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు అదనపు పింఛను పునరుద్ధరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ జేఏసీ అమరావతి హర్షం వ్యక్తం చేసింది. గతంలో డెబ్బై సంవత్సరాలు దాటిన వారికి పది శాతం, డెబ్బై ఐదు సంవత్సరాలు దాటిన వారికి పదిహేను శాతం అదనపు పింఛను అందేదని, 2022లో వీటిని వరుసగా ఏడు శాతం, పన్నెండు శాతానికి తగ్గించారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. గత మూడేళ్లుగా ఈ ప్రయోజనాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నామని, సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తాజాగా ఉత్తర్వులు జారీ కావడం సంతోషకరమన్నారు. ఇందుకు ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి విశ్రాంత ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి చేపట్టిన ప్రతి కార్యక్రమంలో పెన్షనర్లు ముందువరుసలో నిలిచి సహకరించారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంయుక్త సిబ్బంది మండలి, మంత్రుల బృందం సమావేశాల్లోనూ ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించామని, ఇటీవల చేపట్టిన ఉద్యమ కార్యాచరణలోనూ దీనిని ప్రధాన డిమాండ్‌గా ముందుకు తీసుకెళ్లామని పేర్కొన్నారు. అదనపు పింఛను పునరుద్ధరణతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారమైందని తెలిపారు. ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎన్‌పీ శాస్త్రి కూడా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# గుంటూరు జిల్లాలో రూ.527 కోట్లతో పట్టణాభివృద్ధి పనులు

- ప్రతి రూపాయితో ప్రజలకు ప్రయోజనం చేకూరేలా పనులు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గళ్ళా మాధవి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జిల్లాలోని నాలుగు పట్టణాల్లో రూ. 527 కోట్లతో చేపట్టనున్న పట్టణాభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. గుంటూరు నగరపాలక సంస్థకు రూ. 205 కోట్లు, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 250 కోట్లు, తెనాలి మున్సిపాలిటీకి రూ. 44 కోట్లు, పొన్నూరు మున్సిపాలిటీకి రూ. 28 కోట్లతో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ తెలిపారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో రూ. 11,360 కోట్ల విలువైన పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన జరిగినట్లు పేర్కొన్నారు.

గుంటూరు నగరంలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) మోడల్ కింద రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పార్కులు, లైటింగ్ తదితర మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అస్తవ్యస్తంగా ఉన్న ఓవర్‌హెడ్ కేబుల్స్‌కు పరిష్కారంగా అండర్‌గ్రౌండ్ డక్ట్స్ ఏర్పాటు చేసే విధానాన్ని ఒక మోడల్ రోడ్డులో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు చెప్పారు. అండర్‌గ్రౌండ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను కూడా ఇతర నగరాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసి గుంటూరులో ప్రయోగాత్మకంగా చేపట్టే అవకాశాలను పరిశీలిస్తామని తెలిపారు. భారీగా అందుబాటులోకి వచ్చిన నిధులను సమర్థవంతంగా వినియోగించి, ఖర్చు చేసే ప్రతి రూపాయికి ప్రజలకు స్పష్టమైన ప్రయోజనం కలిగేలా నాణ్యతతో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుంటూరును సమగ్రంగా అభివృద్ధి చేసి స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) ప్రాజెక్టులు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. ఒక వార్డును స్మార్ట్ వార్డుగా పైలట్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేయాలని సూచించారు. గుంటూరు నగర సమగ్ర అభివృద్ధికి హ్యామ్ మోడల్ మంచి అవకాశమని ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని మారుమూల ప్రాంతాలకు కూడా మౌలిక వసతులు అందేలా రూ. 205 కోట్ల నిధులను సద్వినియోగం చేయాలని కోరారు.

# ఉపాధ్యాయులపై దాడిని ఖండించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్

- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విజయవాడలోని శాప్ కార్యాలయం ముందు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై సోమవారం జరిగిన దాడిని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం గుంటూరు నగరంలోని కావటి శంకరరావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బొనిగల హైమారావు మాట్లాడుతూ.. ఏదైనా అంశంపై అనుమానాలు, అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గంలో కోర్టులను ఆశ్రయించి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం, కార్యాలయాల వద్ద దౌర్జన్యాలకు దిగడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించిందని, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. డీఎస్సీపై ఆరోపణలు చేయడం, సమావేశాలు నిర్వహించడం, విధుల్లో ఉన్న ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం వల్ల ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు.

ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక భద్రతా చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులపై దాడులను సహించబోమని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడతాయని బొనిగల హైమారావు తెలిపారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ పి. లలిత బాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కూరపాటి రాజా, గుంటూరు వెస్ట్ నగర అధ్యక్షుడు తుమాటి రవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సాంకేతిక పోలీసింగ్‌కు మరో ముందడుగు

- సేఫ్‌స్టే ఏపీ యాప్, సెంట్రలైజ్డ్ డ్రోన్ మానిటరింగ్ పోర్టల్ ప్రారంభం




**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల భద్రతకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతం, సమర్థవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఇందులో భాగంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో 'సేఫ్‌స్టే ఏపీ' యాప్‌తో పాటు ఏఐ ఆధారిత సెంట్రలైజ్డ్ డ్రోన్ మానిటరింగ్ పోర్టల్ (సీడీఎంపీ)ను ఆయన ప్రారంభించారు. హోటళ్లు, పీజీల్లో బస చేస్తున్న వారి వివరాలు, ఆక్యుపెన్సీ సమాచారాన్ని రియల్‌టైమ్‌లో పోలీసులకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ అలర్ట్ ద్వారా సహాయం కోరే అవకాశం సేఫ్‌స్టే ఏపీ ద్వారా కల్పించినట్లు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ అవసరాల కోసం వినియోగించే డ్రోన్లను ఒకే డ్యాష్‌బోర్డ్‌పై పర్యవేక్షించేందుకు సీడీఎంపీని రూపొందించినట్లు డీజీపీ చెప్పారు.

ఇందులో ఏఐ ఆధారిత మానిటరింగ్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, లైవ్ డ్రోన్ ఫీడ్స్, రోల్ బేస్డ్ యాక్సెస్ కంట్రోల్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. నేరాల నివారణ, దర్యాప్తు, మహిళల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణలో సాంకేతికతను విస్తృతంగా వినియోగించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు పోలీసు సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలను వారి ముంగిటకు తీసుకెళ్లడమే లక్ష్యమన్నారు.

గుంటూరు ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత పలు సేవలను రోజువారీ పోలీసింగ్‌లో వినియోగిస్తున్నామని, డ్రోన్ మానిటరింగ్ ద్వారా బందోబస్తు, అసాంఘిక కార్యకలాపాలు, గ్యాంబ్లింగ్, గంజాయి నియంత్రణను కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షించే అవకాశం ఉంటుందని తెలిపారు.

పోలీసింగ్‌లో సాంకేతిక పరిష్కారాల రూపకల్పనకు కేఎల్ యూనివర్సిటీ, యువ సాంకేతిక నిపుణులు, ఆవిష్కర్తలు అందిస్తున్న సహకారాన్ని డీజీపీ అభినందించారు. హోటల్ రంగ ప్రతినిధులు మాట్లాడుతూ సేఫ్‌స్టే ఏపీ ద్వారా గెస్ట్–హోటల్–పోలీస్ మధ్య డిజిటల్ అనుసంధానం ఏర్పడటం అతిథుల భద్రత, అత్యవసర సహాయానికి ఉపయోగపడుతుందని తెలిపారు. సేఫ్‌స్టే ఏపీ, సీడీఎంపీతో ప్రజలకు వేగవంతమైన పోలీసు సేవలు అందించడంతో పాటు నేరాల నివారణ, దర్యాప్తులో సామర్థ్యం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# బీసీ ఉద్యోగుల పదోన్నతులపై హైకోర్టు తీర్పు అమలు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయాన్ని నివారించి, పదోన్నతులపై హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో కేసన శంకరరావు మాట్లాడుతూ.. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో జరుగుతున్న అన్యాయంపై హైకోర్టు 2018 డిసెంబర్‌లో డబ్ల్యూపీ. 4415/2016 కేసులో కీలక ఆదేశాలు జారీ చేసిందన్నారు. 2011 నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కల్పించిన పదోన్నతులను పునఃసమీక్షించాలని కోర్టు ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేసి బీసీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో సుమారు రెండున్నర లక్షల మంది బీసీ ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ, ఉన్నతస్థాయి పదోన్నతి పోస్టుల్లో వారి ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉందని అన్నారు. ఉద్యోగుల్లో సగానికి పైగా ఉన్న బీసీ ఉద్యోగులు ఉన్నతస్థాయి పోస్టుల్లో మాత్రం 10 శాతానికి మించి లేకపోవడం ఆందోళనకరమన్నారు. పదోన్నతుల్లో అనుసరిస్తున్న అసంబద్ధ విధానాలే ఇందుకు ప్రధాన కారణమని ఆరోపించారు.

బీసీ ఉద్యోగులకు దామాషా ప్రాతిపదికన పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించి, న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం అమలు చేసినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఐఏఎస్ అధికారుల నివేదికలు, మంత్రివర్గ ఉపసంఘం నివేదికల పేరుతో కాలయాపన జరుగుతోందని అన్నారు.

రాష్ట్రంలో కొన్ని రిజర్వేషన్ వర్గాలు మాత్రమే పదోన్నతుల్లో రిజర్వేషన్లను పరిమితికి మించి అనుభవిస్తున్నాయని కేసన శంకరరావు పేర్కొన్నారు. దీంతో తగిన సీనియారిటీ ఉన్నప్పటికీ బీసీ, మైనారిటీ ఉద్యోగులకు పదోన్నతులు లభించకపోవడంతో వారు దిగువస్థాయి పోస్టుల్లోనే పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.

రాష్ట్ర సచివాలయంలోని 18 అదనపు కార్యదర్శి పోస్టుల్లో కేవలం ఇద్దరు మాత్రమే బీసీ ఉద్యోగులు ఉండటం సమస్య తీవ్రతకు నిదర్శనమన్నారు. ఇటీవల సచివాలయంలో బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు 34 ఏళ్ల సుదీర్ఘకాలం సేవలందించినప్పటికీ ఉన్నతస్థాయి పదోన్నతి పొందకుండా సహాయ కార్యదర్శిగానే పదవీ విరమణ చేయాల్సి వచ్చిందని తెలిపారు.

బీసీ, మైనారిటీ ఉద్యోగుల పదోన్నతుల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, హైకోర్టు ఆదేశాల ప్రకారం 2011 నుంచి ఇచ్చిన పదోన్నతులను పునఃసమీక్షించి న్యాయం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమర్పించిన వినతిపత్రంలో కోరినట్లు కేసన శంకరరావు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

# ఇక వైసీపీ అడ్రస్ గల్లంతే..



- రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం
- వైసీపీని వీడి టీడీపీలోకి 150 మంది చేరిక
- పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- కూటమి పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామన్న నేతలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** వైసీపీకి రాష్ట్రంలో అడ్రస్ గల్లంతు ఖాయమని, రెండున్నరేళ్ల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి టీడీపీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక పొన్నూరు రోడ్డులోని తూర్పు కార్యాలయంలో 2వ వార్డుకు చెందిన మన్నెపల్లి బెనర్జీ ఆధ్వర్యంలో 150 మంది వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. నూతనంగా చేరిన వారిని ఎమ్మెల్యే నసీర్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో మైనార్టీలకు, స్థానిక ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గాన్ని పదేళ్లు వెనక్కి తీసుకెళ్లారని, అన్ని వ్యవస్థలను నాశనం చేశారని విమర్శించారు. వైసీపీని రాష్ట్రం నుంచి తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రెండున్నరేళ్ల కాలంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో రూ. 350 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అన్ని ప్రాంతాలనూ సమాన స్థాయిలో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లామని, డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యమిచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని భావించి ప్రజలు వైసీపీని వీడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంపై ప్రజలలో నమ్మకం పెరిగిందని చెప్పారు. మైనార్టీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి, ప్రతి పేద కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా కల్పించారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడి పని చేసే వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని తెలిపారు.

# స్థానిక పోరుకు బీజేపీ కార్యకర్తలు సిద్ధం



- ప్రజాస్వామ్య గొంతుకలను అణిచివేసే ప్రయత్నాలను సహించం
- రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, ఎమ్మెల్సీ పోతుల సునీత

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, భూముల లభ్యతతో పాటు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటి లభ్యత పెరుగుతున్న పరిస్థితులను ప్రజలు ప్రత్యక్షంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు స్వయంగా పోల్చి చూస్తున్నారని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, భిన్నాభిప్రాయాలను గౌరవించే ఓపిక అందరికీ ఉండాలని సూచించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించడం, ఇతరులపై దాడులకు ప్రేరేపించడం, అవహేళన చేయడం వంటి చర్యలను కూటమి ప్రభుత్వం సహించబోదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య గొంతుకలు స్వేచ్ఛగా పనిచేసే వాతావరణాన్ని కొనసాగించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

బీజేపీ ఎమ్మెల్సీ పోతుల సునీత మాట్లాడుతూ 2024లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిగా పోటీ చేసి ప్రజల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేశాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. అమరావతి అభివృద్ధి, పోలవరం సహా రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు విస్తృతంగా పనిచేస్తున్నారని తెలిపారు. టీడీపీ, జనసేనతో సమన్వయంతో స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనే దిశగా కూటమి నాయకత్వం చర్యలు చేపడుతోందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, నాగోతు రమేష్ నాయుడు, ఇతర నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణుల సమన్వయంతో ముందుకు సాగుతామని పోతుల సునీత తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై దాడిని ఖండించిన టీఎన్‌యూఎస్

గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్): డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిపై రాజకీయ విమర్శలు చేయడం, వారి అర్హతలను ప్రశ్నించడం సరికాదని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) పేర్కొంది. శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించింది. ఉపాధ్యాయుల గౌరవం, భద్రతకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేసింది. సుదీర్ఘకాలంగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు 2025లో రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం సంతోషకర పరిణామమని టీఎన్‌యూఎస్ అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్‌లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యే అవకాశం లభించిందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం శాప్, విద్యాశాఖ సమన్వయంతో ఎంపిక ప్రక్రియ నిర్వహించిన నేపథ్యంలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపికైన క్రీడాకారుల అర్హతలను రాజకీయ వివాదాలకు ముడిపెట్టడం తగదని స్పష్టం చేశారు. ఎంపిక ప్రక్రియపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కరించుకోవాలని సూచించారు.

శాప్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులపై జరిగిన దాడిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు జరగకుండా ప్రభుత్వం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల గౌరవం, భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడకుండా శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనకు బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టీఎన్‌యూఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

## అదనపు పెన్షన్ క్వాంటమ్ పునరుద్ధరణపై ఎన్జీజీవో సంఘం హర్షం

- నాలుగు లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం
- ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని నాలుగు లక్షల మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లకు ప్రయోజనం కలిగేలా అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను పునరుద్ధరిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేయడంపై ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తగ్గించిన అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను తిరిగి పాత రేట్లకు పునరుద్ధరిస్తూ ప్రభుత్వం జీవో నంబరు 126 జారీ చేయడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వానికి, ఆర్థిక శాఖ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ 5న ముఖ్యమంత్రితో జరిగిన ఉద్యోగ సంఘాల సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ కృషితో కేవలం పదిహేను రోజుల్లోనే ఉత్తర్వులు వెలువడటం పెన్షనర్లలో ఆనందాన్ని నింపిందన్నారు.

ఉత్తర్వుల ప్రకారం డెబ్బై సంవత్సరాలు పూర్తయిన పెన్షనర్లకు అదనపు పెన్షన్ క్వాంటమ్‌ను ఏడు శాతం నుంచి పది శాతానికి, డెబ్బై ఐదు సంవత్సరాలు పూర్తయిన వారికి పన్నెండు శాతం నుంచి పదిహేను శాతానికి పెంచారని తెలిపారు. ఈ పునరుద్ధరణ డిసెంబర్ రెండు వేల ఇరవై ఆరు నెల పెన్షన్ నుంచి, జనవరి ఒకటి రెండు వేల ఇరవై ఏడు నాడు చెల్లించే పెన్షన్‌కు అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. పెన్షనర్ల సంక్షేమానికి సంబంధించిన ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి నిరంతరం తీసుకెళ్లామని, సంబంధిత వర్గాలతో సమన్వయం చేస్తూ పరిష్కారం కోసం కృషి చేశామని విద్యాసాగర్, రమణ తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాల సంక్షేమం కోసం సంఘం నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు. పీఆర్సీ కమిటీ నియామకం, హెల్త్ కార్డుల అంశాలపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలపైనా త్వరలో ఉత్తర్వులు వెలువడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సమగ్ర కేడర్ వ్యవస్థ రూపొందించాలి



- అర్హత, అనుభవం ఆధారంగా ఉపాధ్యాయులకు స్పష్టమైన పదోన్నతులు కల్పించాలి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్య విస్తరిస్తున్న నేపథ్యంలో, అందుకు అనుగుణంగా విద్యాశాఖలో సమగ్ర కేడర్ వ్యవస్థను రూపొందించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని కోరారు. ఎస్జీటీ నుంచి స్కూల్ అసిస్టెంట్, పీజీటీ వరకు స్పష్టమైన పదోన్నతి మార్గాలను రూపొందించాలని, హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో రెగ్యులర్ పీజీటీ కేడర్ ఏర్పాటు చేసి అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతి లేదా నియామక అవకాశాలను కల్పించే అంశాన్ని పరిశీలించాలని కోరారు. అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్చరర్ కేడర్‌లో అవకాశాలపై కూడా పరిశీలన జరపాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, హైస్కూల్ ప్లస్‌లకు అనుగుణంగా ప్రధానోపాధ్యాయుడు, డిప్యూటీ హెడ్‌మాస్టర్, హెడ్‌మాస్టర్, వైస్ ప్రిన్సిపాల్, ప్రిన్సిపాల్ పోస్టుల అవసరాన్ని సమీక్షించాలని కోరారు. ఉపాధ్యాయులకు విద్యాపరమైన మార్గదర్శకత్వం, తరగతి గది పరిశీలన, విద్యార్థుల అభ్యసన ఫలితాల సమీక్ష కోసం క్లస్టర్ స్థాయి విద్యా సహాయక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఈఓ--1, ఎంఈఓ--2, డిప్యూటీ ఈఓ వ్యవస్థలను కూడా పాఠశాలలు, విద్యార్థుల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, పనిభారం ఆధారంగా సమీక్షించాలని పేర్కొన్నారు. డైట్, ఎస్-సీఈఆర్‌టీ, సీటీఈ, ఐఏఎస్ఈ వంటి సంస్థల్లో అర్హులైన ఉపాధ్యాయులకు పనిచేసే, ఉన్నతస్థాయికి ఎదిగే అవకాశాలను కల్పించే విధానాన్ని పరిశీలించాలని కోరారు. స్థానిక కేడర్ల పునర్వ్యవస్థీకరణతోపాటు సర్వీస్ నిబంధనలు, సీనియారిటీ, నియామక యూనిట్, పదోన్నతి మార్గాలు, రిజర్వేషన్--రోస్టర్, వేతన సాపేక్షత, ఉద్యోగుల సర్వీస్ హక్కుల పరిరక్షణ వంటి అంశాలను సమగ్రంగా సమీక్షించాలని సంఘం కోరింది. ఈ అంశాలపై అధ్యయనం చేసేందుకు పాఠశాల విద్య, సాధారణ పరిపాలన, ఆర్థిక, న్యాయ శాఖల ప్రతినిధులతో పాటు విద్యా, సర్వీస్ నిబంధనల నిపుణులతో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని, రిజిస్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలకు తమ అభిప్రాయాలు వెల్లడించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేసింది. 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యావ్యవస్థ విస్తరించిన నేపథ్యంలో ఉపాధ్యాయ కేడర్ నిర్మాణం, పాఠశాల నాయకత్వం, శిక్షణ, పరిశోధన, క్షేత్రస్థాయి పరిపాలన, పదోన్నతి అవకాశాలను కూడా అందుకు అనుగుణంగా మార్చాలని వారు కోరారు.

# ధర్మవరం అభివృద్ధికి రూ.242.28 కోట్ల మహా ప్రణాళిక

- మంత్రి సత్యకుమార్ విజన్‌తో మారనున్న ధర్మవరం రూపురేఖలు
- 27 కి.మీ. మేర కొత్త రహదారులు.. తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి పెద్దపీట
- హెచ్‌ఏఎం కింద రూ.43 కోట్లు.. అమృత్ పథకాలతో తాగునీటి వ్యవస్థకు మరింత బలోపేతం
- రూ.104.28 కోట్ల పనులు పురోగతిలో.. మరో రూ.95 కోట్ల పనులు అనుమతుల దశలో
- కుప్పం నుంచి రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌ఏఎం పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



అమరావతి, సెప్టెంబరు 22 (జర్నలిస్ట్ ఫైల్) : ధర్మవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి వివిధ పథకాల కింద మొత్తం రూ. 242.28 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపడుతున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కులు, వీధి దీపాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచి పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్‌ఏఎం) పనులకు శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణానికి హెచ్‌ఏఎం కింద రూ. 43 కోట్ల విలువైన పనులు కేటాయించామని చెప్పారు. రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాల అభివృద్ధితో పాటు పట్టణ మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు వెల్లడించారు.

ధర్మవరం పట్టణంలో ప్రస్తుతం రూ. 104.28 కోట్ల విలువైన పనులు పురోగతిలో ఉన్నాయని, హెచ్‌ఏఎం కింద రూ. 43 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూఐడీఎఫ్-IV కింద రూ. 72 కోట్లు, యూసీఎఫ్ ఫేజ్-II కింద రూ. 23 కోట్ల పనులు పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని వివరించారు.

**హెచ్‌ఏఎం కింద ధర్మవరానికి రూ.43 కోట్ల పనులు :** ధర్మవరం పురపాలక సంఘానికి హెచ్‌ఏఎం కింద రూ. 43 కోట్ల విలువైన పనులు కేటాయించామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ నిధులతో రోడ్లు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని వెల్లడించారు.

**27 కి.మీ. రోడ్లకు రూ.43 కోట్లు :** అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పథకం కింద ధర్మవరం పట్టణ అభివృద్ధికి రూ. 43 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. ఇందులో సుమారు 25 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు, 2 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణ పనులు ఉన్నాయని చెప్పారు. మొత్తం 27 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

**బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో 13 పనులు పూర్తి :** బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ నిధులతో ధర్మవరం పట్టణంలో 13 అభివృద్ధి పనులను రూ. 390 లక్షలు అంటే రూ. 3.90 కోట్ల వ్యయంతో పూర్తి చేశామని మంత్రి తెలిపారు.

**15వ ఆర్థిక సంఘం నిధులతో 17 పనులు పూర్తి :** 15వ ఆర్థిక సంఘం నిధుల కింద సీసీ కాలువలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన 17 అభివృద్ధి పనులను రూ. 419.73 లక్షలు అంటే రూ. 4.19 కోట్లకు పైగా వ్యయంతో పూర్తి చేశామని మంత్రి తెలిపారు. 2024-25, 2025-26 సంవత్సరాలకు సంబంధించి మరో రూ. 367.41 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

**తాగునీటి సరఫరా బలోపేతానికి రూ.2.54 కోట్లు :** ఆహుడా, పురపాలక సంఘ సాధారణ నిధులతో ధర్మవరం పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరిచేందుకు డీఐ కే9 పైప్‌లైన్ ఏర్పాటు పనులకు రూ. 254.64 లక్షలు అంటే రూ. 2.54 కోట్ల మేర నిధులతో టెండర్ ప్రక్రియ పూర్తి చేశామని మంత్రి తెలిపారు. భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు.

**అమృత్ ఫేజ్-1 కింద రూ.17.57 కోట్ల పనులు.. 90 శాతం పూర్తి :** అమృత్ ఫేజ్-1 కింద రూ. 1,757 లక్షలు అంటే రూ. 17.57 కోట్లు మంజూరు కాగా, ఇందిరమ్మ కాలనీ, సిద్దయ్య గుట్ట ప్రాంతాల్లో ఎల్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం, యర్రగుంట ప్రాంతంలో కొత్త పంప్‌హౌస్ నిర్మాణం, మోటర్ల ఏర్పాటు వంటి పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. ఈ పనుల్లో సుమారు 90 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు.

**అమృత్ ఫేజ్-2 కింద రూ.11.18 కోట్ల పనులు :** అమృత్ ఫేజ్-2 కింద రూ. 1,118 లక్షలు అంటే రూ. 11.18 కోట్లు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. మారుతినగర్ ప్రాంతంలో కొత్త ఎల్‌ఎస్‌ఆర్, జోన్-2 పంపింగ్ మెయిన్, డెలివరీ లైన్ల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయని చెప్పారు. ఈ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు.

**అమృత్ 2.0 కింద రూ.31.73 కోట్ల సమగ్ర తాగునీటి ప్రాజెక్టు :** అమృత్ 2.0 కింద రూ. 3,173 లక్షలు అంటే రూ. 31.73 కోట్ల విలువైన సమగ్ర తాగునీటి ప్రాజెక్టుకు అనుమతులు మంజూరయ్యాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో రోజుకు 10 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రం, రాంనగర్, గిర్రాజు కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో ఎల్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం, అవసరమైన పైప్‌లైన్ల ఏర్పాటు వంటి పనులు ఉన్నాయని చెప్పారు.

ఈ ప్రాజెక్టు ద్వారా ధర్మవరం పట్టణ తాగునీటి సరఫరా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా మౌలిక వసతులు అభివృద్ధి చెందుతాయని మంత్రి పేర్కొన్నారు.

**పురపాలక సంఘ సాధారణ నిధులతో 58 పనులు పూర్తి :** పురపాలక సంఘ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించి 58 అభివృద్ధి పనులు చేపట్టి రూ. 222.73 లక్షలు అంటే రూ. 2.23 కోట్లకు పైగా వ్యయంతో పూర్తి చేశామని మంత్రి తెలిపారు.

**సద్భావన భవనానికి రూ.50 లక్షలు :** ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద ధర్మవరం పట్టణంలో సద్భావన భవనం నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరయ్యాయని మంత్రి వెల్లడించారు.

**పారిశుద్ధ్య మౌలిక వసతులకు రూ.21.68 కోట్లు :** ధర్మవరం పట్టణంలో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 కింద రూ. 21.68 కోట్ల మేర నిధులు కేటాయించబడి, సంబంధిత పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు.

**రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధి :** రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపుల కింద రూ. 5.20 కోట్ల విలువైన రోడ్లు, డ్రైన్లు, పూడికతీత తదితర పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి తెలిపారు.

**తాగునీరు, డ్రైనేజీకి మరో రూ.95 కోట్ల పనులు :** పట్టణ తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు యూఐడీఎఫ్-IV కింద రూ. 72 కోట్ల విలువైన పనులు పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని మంత్రి తెలిపారు. యూసీఎఫ్ ఫేజ్-II కింద డ్రైనేజీ పనులకు మరో రూ. 23 కోట్ల విలువైన పనులు కూడా పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని చెప్పారు.

**రూ.104.28 కోట్ల పనులు పురోగతిలో... :** ధర్మవరం పట్టణంలో ప్రస్తుతం రూ. 104.28 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల పనులు ఇందులో ఉన్నాయని చెప్పారు.

మరోవైపు హెచ్‌ఏఎం కింద రూ. 43 కోట్ల పనులు టెండర్ దశలో ఉండగా, యూఐడీఎఫ్-IV కింద రూ. 72 కోట్లు, యూసీఎఫ్ ఫేజ్-II కింద రూ. 23 కోట్ల పనులు పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని మంత్రి వివరించారు.

**ధర్మవరం అభివృద్ధికి రూ.242.28 కోట్ల సమగ్ర ప్రణాళిక :** ధర్మవరం పట్టణంలో తాగునీరు, మురుగునీటి పారుదల, రహదారులు, డివైడర్లు, పార్కులు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర కీలక మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు అమృత్ 2.0, స్వచ్ఛ భారత్ మిషన్ 2.0, హెచ్‌ఏఎం, యూఐడీఎఫ్-IV, యూసీఎఫ్ ఫేజ్-II, రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు తదితర పథకాల కింద మొత్తం రూ. 242.28 కోట్ల మేర పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

ఇందులో ప్రస్తుతం జరుగుతున్న పనులు, టెండర్ దశలో ఉన్న పనులు, పరిపాలనా అనుమతుల దశలో ఉన్న పనులు ఉన్నాయని చెప్పారు. అన్ని పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లి ప్రజలకు వీలైనంత త్వరగా ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.

**ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే లక్ష్యం :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ధర్మవరం పట్టణ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. తన నిరంతర పర్యవేక్షణతో మంజూరైన, పురోగతిలో ఉన్న, టెండర్, పరిపాలనా అనుమతుల దశలో ఉన్న పనులను సమన్వయంతో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కులు, వీధి దీపాలు తదితర సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని మంత్రి పేర్కొన్నారు.

# మహిళా అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్దపీట





- మహిళా సాధికారతతోనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- మహిళా రైతులు, పారిశ్రామికవేత్తలు మరింత ముందుకు రావాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్): మహిళా సాధికారత, వ్యవసాయాభివృద్ధి, స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం లక్ష్యంగా విశాఖపట్నంలోని గాదెరాజ్ ప్యాలెస్‌లో రాష్ట్రస్థాయి మహిళా రైతులు, మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించారు. భారతీయ కిసాన్ మోర్చా ఆంధ్రప్రదేశ్, గ్రామీణ ప్రాంత రైతుల సహకార సంఘం ఆధ్వర్యంలో 'మన వ్యవసాయం--మన ఆహారం--మన ఆరోగ్యం' అనే సందేశంతో నిర్వహించిన సదస్సుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా రైతులు, పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించి, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, స్థానికంగా తయారవుతున్న వివిధ ఉత్పత్తులను పరిశీలించి వారి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా రైతులు, పారిశ్రామికవేత్తలను అభినందించారు.

పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ మహిళలు వ్యవసాయ రంగంతో పాటు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లోనూ తమ ప్రతిభను చాటుకోవాలని అన్నారు. సేంద్రియ వ్యవసాయం, స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి రంగంలో ఉన్నవారు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం, స్థానిక ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తే కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాలు, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి, పద్మశ్రీ వెంకటేశ్వరరావు, అశోక్ కుమార్, పరశురాం రాజు, ఆదిలక్ష్మి, లక్ష్మీసుజాత, జ్యోతి, విరజశ్రీ, ఐశ్వర్య, డాక్టర్ కృష్ణ, సాయిబాబు, మురళీ, శ్రీనివాస్ మూర్తి, రామకృష్ణ, చంద్రరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 'వికసిత భారత్-2047'పై విద్యార్థుల్లో అవగాహన పెంచాలి



- సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు
- బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్

విజయనగరం (జర్నలిస్ట్ ఫైల్):: సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా విజయనగరంలోని పోర్ట్ సిటీ పాఠశాలలో మంగళవారం 'వికసిత భారత్--2047' అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదాన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి ఎన్. మధుకర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మధుకర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనకు యువతలో దేశభక్తి, సామాజిక బాధ్యత, సృజనాత్మక ఆలోచనలు పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజం, దేశ అభివృద్ధిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడంతో పాటు దేశ భవిష్యత్తుపై ఆలోచించేలా చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ అన్వేషణతోనే నూతన ఆవిష్కరణలు

- ఎస్‌ఆర్‌ఎం యూడీఎల్ కార్యక్రమంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త అనంత నారాయణన్



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన శాస్త్రవేత్తలు, విద్యావేత్తలను తమ క్యాంపస్‌కు ఆహ్వానిస్తూ జ్ఞాన, పరిశోధనా వాతావరణాన్ని మరింత విస్తృతం చేస్తున్న ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ, మంగళవారం మరో విశిష్ట ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించింది. యూనివర్సిటీ డిస్టింగ్విష్ లెక్చర్ (యూడీఎల్) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది.

ప్రముఖ శాస్త్రవేత్త, విద్యావేత్త, ఆస్ట్రేలియాలోని పెర్త్‌లో ఉన్న కామన్వెల్త్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ లో సీనియర్ సైంటిస్ట్ (హెల్త్ అండ్ బయోసెక్యూరిటీ) ప్రొఫెసర్ అనంతనారాయణన్ రామన్ ఎస్‌ఆర్‌ఎం వర్సిటీకి విచ్చేసి తన విశిష్టమైన ఉపన్యాసాన్ని అందించారు.

"ఆసక్తి నుంచి ఆవిష్కరణ దిశగా – శాస్త్రీయ అన్వేషణ శక్తి" అనే అంశంపై ప్రొఫెసర్ రామన్ ఉపన్యసించారు.

శాస్త్రీయ అన్వేషణ ద్వారా ఆసక్తి ఏ విధంగా జ్ఞానంగా మారుతుందో తన ఉపన్యాసంలో ప్రొఫెసర్ రామన్ వివరించారు. క్రమబద్ధమైన పరిశీలన, ప్రశ్నించడం, తార్కిక ఆలోచన, ఆధారాల పరిశీలన, నిరంతర అధ్యయనం, అవగాహనను మెరుగుపరచుకోవడం వంటి అంశాలు శాస్త్రీయ అన్వేషణకు పునాదులని పేర్కొన్నారు. శాస్త్రంలో పురోగతికి ఆసక్తి, ఆవిష్కరణలు కీలక చోదక శక్తులని, అదే సమయంలో తర్కం, జ్ఞానపరమైన నిష్పాక్షికత ఎంతో అవసరమని ఆయన వివరించారు.

మన ముందున్న అభిప్రాయాలు, అంచనాలను ప్రశ్నించడం, ఆధారాలను పరిశీలించడం, కొత్త విషయాలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉండటం శాస్త్రీయ ఆలోచనా విధానంలో ముఖ్యమైన అంశాలని ఆయన తెలిపారు. శాస్త్రీయ అన్వేషణ అనేది నిరంతరం కొనసాగుతున్న ప్రక్రియ అని, ఒక ప్రశ్నకు లభించే సమాధానం మరో కొత్త ప్రశ్నకు దారితీస్తుందని, ఒక ఆవిష్కరణ మరిన్ని పరిశోధనలకు మార్గం సుగమం చేస్తుందని వివరించారు.

కార్యక్రమానికి స్వాగతం పలికిన ఎస్‌ఆర్‌ఎం ఏపీ రీసెర్చ్ డీన్, ప్రొఫెసర్ రంజిత్ థాపా మాట్లాడుతూ, ప్రముఖ శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పరిశోధనా ప్రస్థానాలు, అనుభవాలను విద్యార్థులు, పరిశోధకులకు పరిచయం చేయడంలో యూడీఎల్ సిరీస్ కీలక వేదికగా నిలుస్తోందన్నారు. ఈ సిరీస్ ద్వారా కేవలం జ్ఞానాన్ని పంచుకోవడమే కాకుండా, ప్రముఖ విద్యావేత్తల కెరీర్‌ను తీర్చిదిద్దిన మార్గాలు, సవాళ్లు, విజయాలను యువత అర్థం చేసుకునేలా చేయడం లక్ష్యమని తెలిపారు.

ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రముఖ శాస్త్రవేత్తలతో విద్యార్థులు నేరుగా సంభాషించే అవకాశాలను కల్పించడం ఎంతో విలువైనదని అన్నారు. ప్రొఫెసర్ రామన్ ఉపన్యాసాన్ని ప్రస్తావిస్తూ, "పరిశోధనకు ఆసక్తి పునాది. పరిశోధకులు కొన్నిసార్లు ప్రచురణల ఫలితాలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్న సమయంలో శాస్త్రీయ అన్వేషణలోని ప్రాథమిక సూత్రాలను మరోసారి గుర్తుచేసుకునే అవకాశాన్ని ఈ కార్యక్రమం కల్పించింది" అని పేర్కొన్నారు. విద్యావేత్తగా, మార్గదర్శకుడిగా ప్రొఫెసర్ రామన్ అందిస్తున్న సేవలను వైస్ ఛాన్సలర్ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్ కల్లూరి, యూడీఎల్ కన్వీనర్ డాక్టర్ జె.పి. రాజా పాండియన్, ప్రొఫెసర్ శ్రీనాథ్ సుబ్రహ్మణ్యం, ఈశ్వరి స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ విష్ణుపద్, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467